ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 30 ఏప్రిల్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0 (మంగళవారం)
కనిష్ఠం : 26.0

చేనేత సహకార సంఘాలకు వరాల జల్లు

» జిల్లాలోని 19 సంఘాలకు రూ.12.45 కోట్ల రుణాలకు ఆమోదముద్ర

అమలాపురం టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేనేత సహకార సంఘాల ఆర్థిక పురోభివృద్ధితోపాటు కార్మికుల ఉపాధి అవకాశాల కల్పన కోసం జిల్లా చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో వరాల జల్లు కురిపించారు. జిల్లాలోని 19 చేనేత సహకార సంఘాలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.12.45 కోట్లు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ద్వారా రుణాల మంజూరుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమోద ముద్రవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 23 చేనేత సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వ రాయితీలకు ప్రోత్సాహకాలు అందించి వారి అభివృద్ధికి సహకరించాలన్నారు. జాతీయ హ్యాండ్‌లూమ్స్ కోఆపరేటివ్ డిపార్టుమెంట్ ద్వారా నూలు, రంగులు, రసాయనాల వంటి వాటిపై 50 శాతం రాయితీతో అందిస్తూ మేలు చేకూర్చాలని సూచించారు. ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాల రుణాలు అందించడంతోపాటు సహకార సంఘాలు కూడా కార్మికులకు వ్యక్తిగత రుణాలు అందించే అవకాశం కల్పించాలన్నారు. తద్వారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించి ఆర్థికంగా, సామాజికంగా ఉన్నతి సాధించేలా కృషి చేయాలన్నారు.


మహేష్‌కుమార్

చేనేత సహకార సంఘాల ఆర్థిక స్థితిగతులు, ఉత్పత్తులు, డిమాండ్, సప్లయి వంటి అంశాలపై చేనేత జౌళిశాఖ అధికారులను ఆరా తీశారు. సమావేశంలో సహాయ సంచాలకుడు పెద్దిరెడ్డి, ప్రాంతీయ ఉప సంచాలకుడు ధనుంజయ్, వీవర్స్ సర్వీసెస్ సెంటర్ సహాయ సంచాలకుడు జ్ఞానశేఖర్, జిల్లా మోనిటరింగ్ అధికారి హరిప్రసాద్, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబంలో కొబ్బరి, కోకో పారిశ్రామికవేత్త ఉండాలి : కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబంలో స్థానికంగా కొబ్బరి, కోకో పారిశ్రామికవేత్త ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం 14వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. 13వ సమావేశంలో తీర్మానించిన అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ సభ్యులకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పథకాల కింద జిల్లాలో ఏర్పాటుచేసిన పారిశ్రామిక యూనిట్ల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవడంతోపాటు ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించి పురోగతి దిశగా నడిపించాలన్నారు. ఉపాధికి ఊతం, ఉన్నతికి మార్గమైన క్లస్టర్ డెవలప్‌మెంట్ పరిశ్రమల స్థాపన, స్వయం ఉపాధితోపాటు మరెందరికో ఉపాధిని చూపించేందుకు ఎంఎస్ఎంఈలు దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రెడిట్ లింక్‌తోపాటు రాయితీని కల్పించి పారిశ్రామికంగా, ఉపాధి కల్పనాపరంగా ప్రగతి సాధించాలన్నారు. వివిధ పరిశ్రమల అనుమతి కోసం ఏక గవాక్ష విధానంలో 1721 దరఖాస్తులు రాగా, 1656 అనుమతించామన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా 6902 దరఖాస్తులు వచ్చాయని, దశలవారీగా అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపనకు 34 దరఖాస్తులు రాగా వీటి మంజూరుకు ప్రతిపాదించిన రూ.1.61 కోట్లు కమిటీ సభ్యుల అనుమతితో కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. స్థానికంగా రైతులకు కోకో గింజల పర్మెంటేషన్ ప్రక్రియలో ఇబ్బందులను అధిగమించే చర్యలు చేపట్టాలన్నారు. కోకో గింజలతయారీ కోసం మండే తేజ్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకు వచ్చి డీపీఆర్ సమర్పించిందన్నారు. కంపెనీ ప్రతినిధి నితిన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అనువైన రకాల సాగు, కోకోలో కాయకోత అనంతరం యాజమాన్య పద్ధతులను విశదీకరించారు. కోకో గింజలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని విజయ్‌కుమార్‌కు సూచించారు. పరిశ్రమల కేంద్రం ఏడీ శివరామ్‌ప్రసాద్, డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ, ఉద్యాన అధికారి బీవీ రమణ, ఎల్డీఎం కేశవవర్మ, కృషీవల కొబ్బరి రైతుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అడ్డాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.


అధికారులతో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్

'జలనవరుల అభివృద్ధికి నీటి తీరువా కీలకం'

జలవనరుల అభివృద్ధితోపాటు ప్రాజెక్టులకు నీటి తీరువా వసూళ్లు అత్యంత కీలకమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, భూ పరిపాలనా కార్యదర్శి ఎన్.ప్రభాకర్‌రెడ్డి మంగళవారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. కాన్ఫరెన్సు అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ భూముల క్రమబద్ధీకరణ చట్టం 2025 ప్రకారం అభ్యంతరాలు లేని ప్రభుత్వ ఆక్రమిత భూముల్లో నివాసం ఏర్పరుచుకున్న పేదలకు ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పించిందన్నారు. 150 గజాల వరకు ఆక్రమించుకుని నివాసం ఉన్న వారికి ఎటువంటి రుసుములు లేకుండా ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్నారు. ఆపైడి విస్తీర్ణాలు కలిగినవారు రుసుములు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం డిసెంబరు 31 లోపు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.


గోదావరి పుష్కరాలకు ఏడు ఘాట్లు

అమలాపురం, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం అల్లవరం మండలంలో భక్తుల పుణ్యస్నానాల నిమిత్తం ఏడు ఘాట్లను గుర్తించినట్టు ఎంపీడీవో బి.కృష్ణమోహన్ తెలిపారు. పుష్కర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని బోడసకుర్రు, గోపాయిలంక, గోడి, గోడితిప్ప, బెండమూర్లంకతోపాటు ఓడలరేవులో రెండు ఘాట్లు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారన్నారు. ఆయా ఘాట్ల వద్ద బారికేడింగ్, లైటింగ్, పారిశుధ్య నిర్వహణ, షవర్‌బాత్ వంటి ఏర్పాట్లను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రణాళికలతో కూడిన అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. మే 1న పంపిణీ చేసే సామాజిక భద్రతా పెన్షన్ల సొమ్మును ఈనెల 30న బ్యాంకుల నుంచి డ్రా చేయాలని తెలిపారు. పీజీఆర్ఎస్, స్పౌజ్ పెన్షన్ల ఆన్‌లైన్ అంశాలపై సమీక్షించారు.

గావు..కేక


ఇంత దారుణమా : గోమాత చాలా శుభ్రంగా ఉంటుంది.. ఒక్కసారి తొక్కినా.. తిన్నా మళ్లీ ముట్టదు.. శుచిగా ఉండాల్సిందే.. కాకినాడలో చూశారా.. గ్రౌండ్‌లో ఎండుగడ్డి పడేశారు.. అదే తొక్కి.. అదే తినాలి పాపం..

గో..వ్యథ!


అంబా అన్నా.. ఆలకించరేమయ్యా!

ఈ ఒక్క గోవు చాలు.. గోశాలల్లో గోవులు ఎలా ఉన్నాయో చెప్పడానికి.. ఈ గోవు ఎక్కడుందో తెలుసా.. రాజమహేంద్రవరం శ్రీగౌతమి గో సంరక్షణ కేంద్రం.. ఈ కేంద్రానికి రూ.1.20 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.. నెలకు సుమారు రూ.లక్ష ఆదాయం వస్తోంది. అదిగాక సుమారు 15 ఎకరాల భూమి కూడా ఉంది.. అయినా ఈ కేంద్రంలో గోవులు ఇలా బక్కచిక్కి ఉంటున్నాయి. ఈ సంరక్షణ కేంద్రానికి చేరువగానే ఉమ్మడి జిల్లా ఎండోమెంట్ అధికారి ఉన్నారు.. అయినా ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూడరు.. గోవుల పేరు చెప్పి మేత మాత్రం మేసేసేవారు ఎక్కువయ్యారు.. ఇకనైనా అధికారులు గోశాలలపై దృష్టి సారించాల్సి ఉంది..

గోవులా.. జీవచ్ఛవాలా?

అంబా..అంబా అని పిలిచినా ఆలకించేవారే కరువవుతున్నారు.. ఆలయంలో గోవు కనిపిస్తే మొక్కుతారు.. అదే గోవు ఇంటికి వస్తే ఛీకొడతారు.. రోడ్డుపై బక్కచిక్కి కనిపిస్తున్నా ఏ ఒక్కరూ కన్నెత్తి చూడరు.. హైందవ ధర్మంలో గోవును సకల దేవతా స్వరూపంగా ఆరాధిస్తారు. గోమాత అంటారు. ఆవు పాలను అమ్మపాలతో సమానంగా భావిస్తారు.. అంతటి ప్రాధాన్యం గోవుకు ఇస్తారు.. అందుకే పూర్వం గోవులకు ఎక్కడికక్కడ గోశాలలు నిర్మించారు.. గోవులకు దానాలు చేశారు. ఎన్ని చట్టాలుంటే ఏం లాభం.. ఎన్ని ఆస్తులుంటే ఏం లాభం.. గోవు నేడు బక్కచిక్కిపోతోంది.. ఏ గోవు బతుకు చూసినా కన్నీటి వ్యథగా మారి.. చివరకు గోవధశాలలకు తరలిపోతోంది. ఇటీవల తిరుపతి దేవస్థానం గోశాలలో ఆవుల మృతి ఆరోపణల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గోశాలల్లో గోవ్యథపై ప్రత్యేక కథనం..

పట్టని..ఆవేదన

- » గోశాలల్లో సంరక్షణ వట్టిమాటే
- » మేతా లేదు.. నీళ్లూ అరకొరే
- » ఎండిన డొక్కలు.. బేలచూపులు
- » గాలికొదిలేస్తున్న వైనం
- » దాతల సహకారమూ 'మేతే'
- » రాజమండ్రిలో ఆకలి అరుపులు
- » కాకినాడలోనూ పస్తులే
- » అంతర్వేదిలోనూ ఇంతే
- » అన్నవరంలో చూస్తే చింతే
- » కన్నెత్తి చూడని అధికారులు

అన్నవరాన చింతేగా!

అన్నవరం : రత్నగిరిలోని అన్నవరం దేవస్థానం గోశాలలో గోవులన్నీ బక్కచిక్కి కనిపిస్తున్నాయి. గోసంరక్షణ ట్రస్టు నుంచే కాకుండా వీటి సంరక్షణకు దేవస్థానం ప్రధాన అకౌంట్ నుంచి నిధులు కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. గోశాలలో సుమారు 110 వరకు గోవులు ఉన్నాయి. ఆవులకు అందించే మేతను సెంట్రల్ స్టోర్స్ నుంచి గోశాలకు అందించి వాటికయ్యే వ్యయాన్ని గోసంరక్షణ ట్రస్ట్ నుంచి రికవరీ చేస్తున్నారు. రోజుకు సుమారు 30 లీటర్ల పాలను గోశాల నుంచి తీసుకెళ్తున్నా ఈ పాలకు మాత్రం దేవస్థానం ప్రధాన అకౌంట్ నిధుల నుంచి గోసంరక్షణ ట్రస్ట్‌కు జమచేయకపోవడం విశేషం. ఇక్కడ పచ్చగడ్డిని మరింత పెంచాల్సి ఉంది. దీనికోసం దేవస్థానం డిగ్రీ కళాశాల వెనక భాగంలో సుమారు 6 ఎకరాల్లో గోసంరక్షణకు పచ్చగడ్డి పెంచాలని ఇటీవల రత్నగిరికి విచ్చేసిన అటవీశాఖాధికారి నివేదించినా అదింకా కార్యరూపం దాల్చలేదు. గోశాలకు ఎవరైనా ఆవులు దానమిస్తే దాత నుంచి గోవుతోపాటుగా వాటి పోషణకు రూ.10,116 వసూలు చేస్తున్నారు. వీటి నుంచే ట్రస్ట్ నిధులు సమకూరుతున్నాయి. వీటిపై వచ్చే వడ్డీతో గోసంరక్షణ చేపడుతున్నారు. గోసంరక్షణపై దేవస్థానం ఉన్నతాధికారులు మరింత దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. గోరక్షణకు ఎన్ని చట్టాలు ఉన్నా నిరుపయోగమే.


అన్నవరంలో మేతకు కుమ్ములాటలే..



నిర్జీవకారుణ్యం!

రాజమండ్రిలో అవినీతి మేతలు




(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ నియంత్రణలో ఉన్న జిల్లాలోనే పెద్దది రాజమహేంద్రవరం భాస్కర్‌నగర్ శివారు శ్రీగౌతమీ గోరక్షణ సంఘం. ఈ గోకులంలో ఉన్న 95 గోవులు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గోశాలలోని నాలుగు షెడ్లలోనూ అపరిశుభ్రతకు కొదువలేదు. బిహారుకు చెందిన ఇద్దరు పనోళ్లు ఉన్నారు. కానీ ముగ్గురు నలుగురు రోజూ ఉంటారని లెక్కలు వల్లించడం గమనార్హం. అయినా పశువులు మాత్రం వ్యర్థాల్లోనే పొర్లాడుతున్నాయి. 1940లో శ్రీ కారుణ్యానంద స్వామీజీ ఆపన్నులను ఆదుకోవడానికి, గోవుల సంరక్షణకు శ్రీగౌతమీ జీవ కారుణ్య సంఘాన్ని స్థాపించారు. అప్పట్లోనే సంఘానికి మత్తె నారాయణమ్మ అనే దాత ఉదారంగా 15.40 ఎకరాలు ఇచ్చారు. 1972 నుంచి ఈ సంఘం ఎండోమెంట్ ఆధీనంలోకి వెళ్లింది. జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమానికి మిగిలిన భూమిలో ఓ 4.43 ఎకరాలు గోశాలకు నామమాత్ర లీజుతో దాఖలు పడింది. సంఘం పేరున రూ.1.20 కోట్ల వరకూ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, గోరక్షణ పేటలోని షాపులు ఉన్నాయి. డిపాజిట్లపై వడ్డీ, షాపుల అద్దెల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకూ ఆదాయం సమకూరుతోంది. అయినా గోశాలలోని గోవులు ఎండిన డొక్కలతో ఎవరు వెళ్లినా తమ జీవితాలు బాగుపడతాయేమోననే ఆత్రుతతో బేల చూపులు చూస్తున్నాయి. దూడలు దయనీయ స్థితిలో కనిపిస్తున్నాయి. రెండు ఎకరాల్లో పండించిన గడ్డి ఎవరు మేస్తున్నారో తెలియదు. ఈ గోశాలకు 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.4 లక్షలు ఇవ్వాలంటూ వాడపల్లి దేవస్థానాన్ని ఆదేశించింది. అయితే తర్వాత వైసీపీ పాలన రావడంతో ఆ ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయి. మూలధనంపై వచ్చే వడ్డీనే గోశాల మనుగడకు ఆధారం. అయితే లెక్కా పత్రాలు పక్కాగా లేని పరిస్థితి. కొందరు దాతలు తాము చేసిన సహాయానికి ప్రత్యుపకారంగా గోశాల నుంచి ఉపకారం పొందడం కూడా ఆదాయానికి గండిగా మారింది. ఈ గోసంరక్షణ కేంద్రం చెంతనే జిల్లా ఎండోమెంట్ అధికారి, ప్రాంతీయ ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ ఉన్నా ఇక్కడి పరిస్థితిలో పెద్దగా మార్పేమీ లేదు.

అంతర్వేదిలో ఆకలి కేకలు

అంతర్వేది: అంతర్వేదిలోని గోశాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. కనీసం గోవులకు కడుపు నిండా మేత లేని స్థితిలో అవి కొట్టుమిట్టాడుతున్నాయి.శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయం అధికారులే గోశాల నిర్వహణ పర్యవేక్షిస్తారు. గోవుల సంరక్షణకు ఒక అర్చకుడు, ఐదుగురు సిబ్బంది ఉన్నారు. గతంలో అంతర్వేది ఆలయానికి ఆనుకుని పచ్చగడ్డి, ఎండుగడ్డి తగిన మంచినీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం అంతర్వేది పరిసర ప్రాంతాల్లో ఎటువంటి వ్యవసాయేతర భూములు సాగులో లేకపోవడం, పచ్చగడ్డి, ఎండుగడ్డి కొరత ఎక్కువగా ఉంది. దాతలు ముందుకొచ్చి ఎండుగడ్డి, దాణాను దానం చేయడంతో ఉన్న ఆవుల నిర్వహణ జరుగుతోంది. నెలకు రూ.లక్షా 50 వేలు ఖర్చుచేసి గోశాలను నిర్వహిస్తున్నామని ఆలయ అధికారులు చెబుతున్నా ఆ స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.


అంతర్వేదిలోనూ నకనకలే..


కాకినాడలో నిర్వహణకు ఐదుగురు ఉన్నా..ఏడాదికి రూ.36 లక్షలు ఖర్చు చేస్తున్నా ఇదీ దుస్థితి

కాకినాడలో కమిషనర్ చైర్మన్‌గా ఉన్నా ఇంతేగా!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నోరు లేని మూగజీవాలను పట్టించుకునే వారే కరువయ్యారు. కమిషనర్‌స్థాయి అధికారి చైర్మన్‌గా ఉన్న కాకినాడలో ఎస్పీసీఏ ఆధ్వర్యంలో నడుస్తోన్న గోసంరక్షణ కేంద్రంలో గోవులు అర్ధాకలితో అలమటిస్తూ అవస్థలు పడుతున్నాయి. 2.7 ఎకరాల్లో ఉన్న కేంద్రంలో ప్రస్తుతం 215 వరకు గోవులు ఉన్నాయి. కబేళాలకు తరలిపోయే ఆవులను పట్టుకుని ఈ కేంద్రానికి తరలిస్తారు. ఈ కేంద్రం ప్రస్తుతం నగరపాలక సంస్థ అధికారుల అధీనంలో ఉంది. కాకినాడ మునిసిపల్ కమిషనర్ అడహక్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. ఇద్దరు వర్కర్లు, ఒక వాచ్‌మన్, సూపర్‌వైజర్, వెటర్నరీ డాక్టర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ గోశాల స్థలాన్ని ఆనుకుని షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. వాటి అద్దెల ద్వారా వచ్చే ఆదాయాన్ని గోసంరక్షణ కేంద్రం నిర్వహణకు వినియోగిస్తుంటారు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న స్థలంలో 150 గోవులు ఉండాలి. కానీ అదనంగా మరో 70 పశువులను ఉంచారు. షెడ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో గోవులు కాలం వెళ్లదీస్తున్నాయి. నగరపాలక అధికారులు వాటి సంరక్షణకు సిబ్బందినైతే ఉంచారే తప్ప వాటి నిర్వహణను గాలికొదిలేశారు. మంచినీటి తొట్లెల్లో నీళ్ల లేవు. గడ్డిని ఇష్టానుసారంగా నేలపై వేసేశారు. అసలే వేసవి కాలం.. గొంతెండుతున్న రోజులివి. ఈ సమయంలో వాటి గొంతులను తడిపే వారే కరువయ్యారు. గోవులకు ఏడాదికి రూ.36 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు లెక్కల్లో చూపెడుతున్నారు.. అక్కడి పరిస్థితి చూస్తే మాత్రం అలా లేదు. 2017 ఆగస్టులో ఈ గోశాలలో అనారోగ్య సమస్యలతో 140 వరకు ఆవులు చనిపోయాయి. కానీ అప్పట్లో ఎఫ్ఐఆర్‌లో 20 ఆవులనే చూపించినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ కేంద్రంలో అపరిశుభ్రత అలాగే ఉంది. కమిషనర్ చైర్మన్‌గా ఉన్నా నిర్వహణలో మార్పులేదు.

కామెర్ల మందు సృష్టికర్త

సూర్యారావుకు పద్మ అవార్డుకు కృషి చేస్తా!

శతాబ్ది ఉత్సవాల్లో కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

గుండుబోగుల వంశీకులు వెల్ల మందు పంపిణీ కొనసాగించడం అభినందనీయం

ఈ సేవలు మరో వందేళ్లు కొనసాగాలి : మంత్రి సుభాష్

7


చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు వద్ద దిగబడుతున్న వాటర్ స్టోరేజ్ ట్యాంకు రక్షణ గట్టు.. పక్కన స్టోరేజ్ ట్యాంకు

తాగునీటి ప్రాజెక్టుపై ఇంత నిర్లక్ష్యమా!

» చల్లపల్లి స్టోరేజ్ ట్యాంక్ నిర్వహణ అధ్వానం » జారిన రక్షణ గట్టు » డస్ట్‌బిన్‌లుగా మారిన ఎయిర్ పిట్స్

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ తాగునీటి ప్రాజెక్టు నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. వాటర్ స్టోరేజ్ ట్యాంకు రక్షణను గాలికొదిలేశారు. గట్టుపై మొలిచిన మొక్కలను నిర్లక్ష్యం చేయడంతో అవి నేడు వృక్షాలుగా మారి చెరువు గట్టును బలహీనపరుస్తున్నాయి. ఈ వృక్షాల కారణంగా రక్షణ గట్టు బీటలువారుతోంది. గట్టు చెరువులోకి దిగజారిపోతోంది. అయినా అధికారుల్లో స్పందన లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే ప్రాజెక్టుకు ముప్పు తప్పదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అత్యవసర సర్వీసుల్లో ప్రధానమైన తాగునీటి సరఫరాలో నిరంతరం అంతరాయాలే. వేసవి ముందు, తర్వాత అధికారులు కనీస ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. రక్షిత తాగునీరు అందించాలన్న సంకల్పంతో 2001లో ప్రస్తుత సీఎం చంద్రబాబు చల్లపల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ మెగా ప్రాజెక్టును ప్రారంభించారు. 15,10,000 లీటర్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు ఉప్పలగుప్తం మండలంలోని దాదాపు 12 గ్రామాల దాహార్తిని తీరుస్తోంది. ఈ పాతికేళ్లలో జనాభా పెరిగింది. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు పెరిగాయి. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిపథకం కొనసాగుతోంది. అయితే ప్రాజెక్టు నిర్వహణలో మాత్రం క్రమంగా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ప్రధానంగా ప్రాజెక్టుకు ఆధారమైన వాటర్ స్టోరేజ్ ట్యాంకు ప్రమాదపుటంచుల్లో ఉంది. ప్రతి ఏటా గట్టుపై మొక్కలు, తుప్పలు లేకుండా శుభ్రం చేయవలసిన పనికి అధికారులు ఎప్పుడో స్వస్తి పలికారు. ఫలితంగా చెరువు గట్టు బీటలు వారుతోంది. పలుచోట్ల గట్టు చెరువులోకి కుంగిపోతోంది. ప్రతి ఏటా వేసవిలో కూనవరం ప్రాజెక్టు పరిధి గ్రామాలకు కూడా తాగునీరందించే చల్లపల్లి ప్రాజెక్టు నేడు నిర్వహణ లోపంతో శిథిలస్థితికి చేరుకుంటోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పేర్ మోటార్ అందుబాటులో ఉండదు. ఫిల్టర్ల నిర్వహణలోనూ సరైన కార్యాచరణ లేక ఇప్పటికీ తాగునీటిలో ఇసుక వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఏ గ్రామంలో చూసినా తాగునీటి కష్టాలే. దీనికి కారణం పంచాయతీ ట్యాంకులకు సక్రమంగా సకాలంలో పంపింగ్ జరక్కపోవడమే. ప్రతిరోజూ ఏదొఒక ప్రాంతంలో పైప్‌లైన్ దెబ్బతినడం సర్వసాధారణమైంది. ప్రధాన పైప్‌లైన్‌లో కొన్ని ప్రాంతాల్లో నీటి ప్రవాహ వేగాన్ని పెంచేందుకు ఏర్పాటుచేసిన ఎయిర్ పిట్ల మూతలు పాడవ్వడంతో డస్ట్‌బిన్‌లుగా మారి తాగునీరు కలుషితమవుతోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఏటా చల్లపల్లి ప్రాజెక్టు నిర్వహణకు రూ.1.80 కోట్లు మంజూరవుతాయి. కానీ ప్రాజెక్టు చెరువు గట్టును శుభ్రం చేయడానికి అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది ప్రజల ప్రశ్న. ఫిల్టర్లు పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా ఎందుకు దృష్టి పెట్టరని నిలదీస్తున్నారు. పంచాయతీలు కూడా ఈ సమస్యను అంతగా పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో ట్యాంకులకు నీరు పూర్తిగా చేరిందా లేదా అన్నది పట్టించుకునే వారు లేకపోవడంతో ట్యాంకులు నిండినా నిండకపోయినా సమయానికి వాల్వ్ ఓపెన్ చేస్తారు. నీరు వస్తే పట్టుకోవడం లేదంటే మౌనం వహించడం ప్రజలకు అలవాటుగా మారింది. కుళాయిలు పాడైనా కొత్తవి వేయకపోవడంతో నీరు వృథాగా పోతోంది. పంచాయతీ వాటర్ ట్యాంకులు సకాలంలో శుభ్రం చేయకపోవడంతో నాచు, మలినాలతో కూడిన నీటిని చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా చెరువు చుట్టూ తుప్పలు, చెట్లు ఉన్న మాట వాస్తవమే.. సాంకేతిక కారణాల దృష్ట్యా వేసవి అనంతరం చెట్లు తొలగించే పనులు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ చెప్పారు.

అది గది గో

శ్రీకాకుళానికి చెందిన వెంకటేష్, సుధాకర్, రామారావు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరో ఇద్దరితో కలిసి ఓ రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇప్పటికే ఓ ఇనిస్టిట్యూట్‌లో ఆరు నెలల పాటు ఆల్ కాంపిటేటివ్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారు ఉంటున్న రూమ్.. ఐదుగురూ చదువుకోవడానికి వీలుగా లేదు. దీంతో వెంకటేష్, సుధాకర్ వేరే రూమ్ కోసం అన్వేషణ ప్రారంభించారు. వారికి భానుగుడి కోకిల సెంటర్లో ఓ భవంతి ఎదుట స్టడీ రూమ్ అనే బోర్డు కనిపించింది. ఆ లోపలికి వెళ్లి చూసేసరికి అక్కడి వాతావరణం తెగ నచ్చేసింది. చల్లని గదుల్లో.. వేర్వేరు క్యాబిన్ల మధ్య చక్కని ఏకాగ్రతతో చదువుకుంటున్న పలువురిని చూసి ఆశ్చర్యపోయారు. "మనం కూడా ఇక్కడికి వచ్చేద్దాం అని అనుకున్న వారిద్దరూ.. వెంటనే చేరిపోయారు."



కాకినాడలోని ఓ స్టడీ రూమ్‌లో చదువుకుంటున్న యువత



కాకినాడ డెయిరీ ఫారానికి చెందిన మోజెస్ కూడా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇంటి దగ్గర స్థిరంగా ఉండి చదవడానికి వీలుపడట్లేదు. చదువుదామని పుస్తకం తీసేసరికి ఇంట్లో వాళ్లు ఏదో ఒక పని చెప్పడం, వాటిపై బయటకు వెళ్లడం జరుగుతోంది. ఇక లాభం లేదనుకున్న మోజెస్ స్టడీ రూమ్‌లో ఓ క్యాబిన్ తీసుకున్నాడు. ఉదయం తొమ్మిది గంటలకు అక్కడికి రావడం.. చదువుకోవడం తిరిగి సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి వెళ్లడం.. ఇదే అతడి దినచర్య.

వీరే కాదు.. ఇలాంటి వారెందరో ప్రస్తుతం స్టడీ రూమ్‌లనే ఆశ్రయిస్తున్నారు.



- పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రత్యేక స్టడీ రూమ్స్
- కాకినాడ, రాజమహేంద్రవరంల్లో కొత్త కల్చర్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొలువుల జాతర మొదలైంది. ఇప్పటికే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలను భర్తీ చేసే అవకాశం ఉండడంతో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నారు. ప్రస్తుత పోటీ యుగంలో ఉద్యోగం పొందాలంటే.. ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులుగా తయారుకావాలి. అలా కావాలంటే ఏకాగ్రతతో చదవాలి. చదువుకునే వాతావరణం ప్రశాంతంగా ఉండాలి. సందేహాలు వస్తే తీర్చే వెసులుబాటు ఉండాలి. ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి. ఇలాంటి వారందరి అవసరాలు తీరుస్తున్నాయి రీడింగ్, స్టడీ రూమ్‌లు.

ఇటీవలి కాలంలో కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ప్రధాన నగరాల్లో ఇలాంటివి అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ కొలువు ఒక్కటే కాదు.. యూనివర్సిటీల్లో, విదేశాల్లో సీటు సంపాదించాలనే లక్ష్యంతో ఉన్న వారు సైతం ఈ నగరాలకు వచ్చి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వసతిగృహాల్లోనో, గదులు అద్దెకు తీసుకుని ఉంటున్న వీరిలో పలువురు రీడింగ్, స్టడీ రూమ్‌లవైపు మొగ్గుచూపుతున్నారు

ఐదేళ్ల క్రితమే ఆరంభం...

కాకినాడ నగరంలో ఈ రీడింగ్ రూమ్ సంస్కృతి సుమారు ఐదేళ్ల క్రితమే ప్రారంభమైంది. అప్పట్లో ఒకటో, రెండో మాత్రమే ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య సుమారు 50కి పెరిగింది. ముఖ్యంగా శ్రీనగర్, విద్యుత్‌నగర్, కరణంగారి సెంటర్ తదితరచోట్ల ఈ రీడింగ్ రూమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ ప్రతి అభ్యర్థికీ ప్రత్యేక క్యాబిన్, ఏసీ, మినరల్ వాటర్, ఉచిత వైఫై, మొబైల్ చార్జింగ్ పాయింట్, న్యూస్ పేపర్స్, వాహన పార్కింగ్, పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు వంటి ఇతర వస్తువులు భద్రపరచుకునేందుకు ప్రత్యేక లాకర్లు, వాష్‌రూమ్స్.. ఇలా అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు. సీజన్‌ను బట్టి అద్దె వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఏసీ క్యాబిన్.. నెలకు రూ.1,500 వరకు, నాన్ ఏసీ రూ. 1,000 నుంచి రూ.1,200 వరకు అద్దెలు ఉన్నాయి. ఉదయం ఆరు నుంచి రాత్రి పదకొండు గంటల వరకు ఇవి తెరిచి ఉంటాయి. రాజమహేంద్రవరంలోనూ ఈ తరహా స్టడీ, రీడింగ్ రూమ్‌లు పదుల సంఖ్యలో ఉన్నాయి.

ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా ఏర్పాట్లు



మా అబ్బాయి హైదరాబాద్‌లో చదువుకునే సమయంలో ఈ రీడింగ్ రూములను వినియోగించుకునేవాడు. వాటిని చూసి కాకినాడలో ఏర్పాటుచేశాడు. కాకినాడలో మాదే ఫస్టు రీడింగ్ రూమ్.. వాటికి డిమాండ్ పెరగడం, చాలా మంది ఆసక్తి చూపుతుండడంతో ప్రస్తుతం అనేకచోట్ల అందుబాటులోకి వచ్చాయి. ఒకేసారి 50 మంది సాధన చేసుకునేలా 50 క్యాబిన్లు ఏర్పాటు చేశాం. వారికి అనేకానేక సౌకర్యాలతో పాటు ఏకాగ్రతతో చదువుకునే వాతావరణం కల్పిస్తున్నాం. ఇక్కడ కూర్చుని చదువుకోవడమే కాదు.. ఏవైనా సందేహాలుంటే పక్క వాళ్లతోనూ పంచుకుంటూ ఉంటారు.

ఫణిశేఖర్, స్టడీ రూమ్ నిర్వాహకుడు, కాకినాడ

ఎంతసేపైనా చదువుకోవచ్చు



నేను పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. ఇంటి దగ్గర చదువుకుందామంటే కుదరట్లేదు. ఏకాగ్రత కోసం స్టడీ రూమ్‌ను ఆశ్రయించాను. ఇక్కడ చదువుకోవడానికి వాతావరణం బాగుంది. మన పుస్తకాలను మనమే తీసుకువెళ్లి ఎంతసేపైనా చదువుకోవచ్చు. పలు ఉద్యోగాలకు సాధన చేసే అభ్యర్థులు ఉండడం వల్ల ఇక్కడ వారి సలహాలు, సూచనలు తీసుకునే అవకాశం ఉంది.

రవికిరణ్, పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థి, కాకినాడ



బోట్ల ర్యాలీలో పాల్గొన్న యజమానులు, మత్స్యకారులు

థాంక్యూ సీఎం

వేట నిషేధ పరిహారం పెంపుపై మత్స్యకారుల హర్షాతిరేకాలు

ఏటిమొగ నుంచి జగన్నాథపురం పాత వంతెన వరకు 200 బోట్లతో ర్యాలీ

మత్స్యకారులకు అండగా ఉంటాం: కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు పరిహారం ఇవ్వకుండా మాయమాటలతో మోసం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు అందించే వేట నిషేధ పరిహారాన్ని రూ.10వేల నుంచి రూ.20 వేలకు పెంచి అందించడంపై బోట్ల యజమానులు, మత్స్యకార లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కొండబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పుటేరులో బోట్ల ర్యాలీ నిర్వహించారు. ఏటిమొగ రోడ్డులోని బోటు ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నుంచి జగన్నాథపురం పాత వంతెన వరకు సుమారు 200 బోట్లతో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సేవలో... థాంక్యూ సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చిందన్నారు. కాకినాడ నగరంలో 390కి పైగా బోట్లు ఉన్నాయని, వాటిపై సుమారు 4వేల మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో పరిహారం నగదు జమ అయ్యిందన్నారు. అర్హులందరికీ మత్స్యకార భరోసా అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు మత్స్యకారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బోట్ల యజమానులు, లబ్ధిదారులు ఉప్పుటేరు వంతెన మీద నుంచి ఎమ్మెల్యే కొండబాబుపై పూల వర్షం కురిపించారు. చంద్రబాబునాయుడు ఫ్లెక్సీలు, టీడీపీ జెండాలను బోట్లకు కట్టి పసుపుమయం చేశారు. కార్యక్రమంలో కాకినాడ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ, బోటు ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లాడి రాజు, కోశాధికారి చింతా పేర్రాజు, బోట్ల యజమానులు నాటి బాబులు, పాలెపు ధర్మారావు, పినపోతు రాము, వోలేటి పాండురంగడు, పినపోతు జీవరత్నం, అంకే నూకరాజు, చోడిపల్లి సతీష్, మూగు రాజు, ఎరిపిల్లి రాము, మేరుగు రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబుపై పువ్వులు జల్లుతున్న మత్స్యకారులు

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత నిర్బంధ
ప్రవేశాల షెడ్యూల్ మార్పు

రంగంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీఈ కింద ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత నిర్బంధ ప్రవేశాల షెడ్యూల్ మార్పు జరిగిందని ఎంఈవో కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పేద విద్యార్థులకు 25శాతం ఉచితంగా సీట్ల కేటాయింపు మే 2నుంచి 19వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించి 25శాతం ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 28 నుంచి జరగాల్సిన దరఖాస్తుల స్వీకరణ కొన్ని అనివార్య కారణాల వల్ల మే 2నుంచి మే 19వరకు మార్పు చేసినట్టు సమగ్రశిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ప్రకారం మే 20నుంచి మే 24వరకు విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తారు. లాటరీ విధానంలో మొదటి విడత ఫలితాలను మే 29న విడుదల చేసి సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 8న ఖరారు చేస్తారన్నారు. రెండో విడత ఫలితాలను జూన్ 11న విడుదల చేసి, సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 18న ఖరారు చేస్తారన్నారు. అర్హులైన విద్యార్థులు ప్రాథమిక వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4258599ను సంప్రదించవచ్చునని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న దర్శనానికి స్లాట్ విధానం



ఆత్రేయపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం దర్శనాలు చేసుకునే భక్తులకు స్లాట్ విధానం అమలు చేస్తున్నట్టు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతి శనివారం 50వేలు పైబడి భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ప్రతి భక్తుడికి స్వామివారిని దర్శనం కలిగేలా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు స్లాట్ విధానం అమలు చేస్తున్నట్టు తెలిపారు. వీఐపీ దర్శన సిఫార్సు లేఖలపై వచ్చే భక్తులకు ఉదయం 7నుంచి 8గంటల వరకూ, మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకూ మాత్రమే సిఫార్సు లేఖల దర్శనానికి అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు. చంటిబిడ్డ తల్లులకు, దివ్యాంగులకు, వారికి తోడుగా వచ్చే ఒకరికి ఉదయం 11గంటల నుంచి 12గంటలకు ఉచిత దర్శనం కల్పిస్తున్నామన్నారు. కేవలం భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని స్లాట్ విధానం అమలు చేస్తున్నట్టు ఆలయ ఉపకమిషనరు సూర్యచక్రధరరావు పేర్కొన్నారు.

కంచి పీఠం ఉత్తరాధికారిగా గణేశశర్మ
నేడు బాధ్యతల స్వీకరణ



తల్లిదండ్రులతో గణేశశర్మ

అన్నవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో సుప్రసిద్ధ కంచి కామకోటి పీఠానికి ఉత్తరాధికారిగా నియమితులైన కాకినాడ జిల్లా అన్నవరం రుగ్వేద పండితుడు దుడ్డు సత్య వెంకటసూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ ద్రావిడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈనెల 25న కంచి పీఠం శ్రీకార్యం మేనేజర్ విశ్వనాథశాస్త్రి అధికారికంగా ప్రకటించగా 26 నుంచి కంచిపీఠంలో గణేశశర్మ సన్యాసదీక్ష కార్యక్రమాలు ప్రారంభించారు. బుధవారం ప్రస్తుత పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీ పీఠం బాధ్యతలు అప్పగించనున్నారు. అన్నవరం పండితుడికి అరుదైన గుర్తింపు లభించడంతో గ్రామంలో పురోహితులు, అర్చకులు ప్రత్యేక సంబరాలకు సిద్ధమవుతున్నారు.

అన్నవరం దేవస్థానంతో అనుబంధం

కంచిపీఠంతో అన్నవరం ఆలయానికి విడదీయరాని అనుబంధం ఉంది. ఆలయంలో వైదిక కార్యక్రమాలకు కంచి పీఠాధిపతుల సలహాలు, సూచనలు తీసుకుంటుంటారు. సత్యదేవుడి నూతన ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం 2013లో అప్పటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామీజీ చేతులమీదుగా జరిగింది. గణేశశర్మ సన్యాస దీక్షా కార్యక్రమానికి అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావుతో పాటు కుటుంబీకులు, పలువురు పండితులు కంచి వెళ్లారు.

పద్మశ్రీ అందుకోవడం ఆనందంగా ఉంది



పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న బుర్రకథ కళాకారుడు అప్పారావు కుమార్తె శ్రీదేవి

బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావు కుటుంబ సభ్యులు

రావులపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బుర్రకథ కళారంగాన్ని ముందుకు తీసుకువెళ్తూ ఎన్నో స్టేజీ ప్రదర్శనలు చేసిన దివంగత మిరియాల అప్పారావుకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించి అందజేయడం ఆనందకరంగా ఉందని మిరియాల అప్పారావు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మిరియాల అప్పారావు కుమార్తె యడ్లవల్లి శ్రీదేవి పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. దీంతో రావులపాలెంలో వారి కుటుంబ సభ్యులు ఆనందంగా వ్యక్తంచేశారు. అప్పారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో పాటు పలువురు నాయకులు అభినందించారు.

వేర్వేరు చోట్ల చోరీలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వేర్వురు చోట్ల రెండు దొంగతనాలు జరిగాయని పోలీసులు తెలిపారు. ధర్మవరానికి చెందిన టి.తమ్మారావు తన భార్య, బంధువులు ఇద్దరితో కలిసి సొంత పనులు నిమిత్తం మంగళవారం కారులో రాజమహేంద్రవరం వచ్చారు. స్థానిక కటారీనగర్‌లోని కృష్ణకళ్యాణ్ రెస్టారెంట్ వద్ద కారు పార్కు చేస్తుండగా వాలెట్స్ వచ్చి కారును తాము పార్కు చేస్తామనడంతో తమ్మారావు వారి కుటుంబ సభ్యులతో కలిసి రెస్టారెంట్‌లోకి వెళ్లి భోజనాలు చేసి గంట తర్వాత బయటకు వచ్చారు. కారును తీసుకున్నారు. అయితే తమ్మారావు భార్య, 3 కాసుల బంగారు వస్తువులు బ్యాగులో పెట్టి కారులో వదిలేసింది. ఆ వస్తువులు కనిపించలేదు. దీంతో తమ్మారావు ప్రకాష్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే స్థానిక ఆల్‌కట్ తోటకు చెందిన డి.రఘుశ్యామ్ ఈనెల 25న కుటుంబంతో కలిసి విశాఖపట్నంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి మంగళవారం తిరిగి వచ్చాడు. ఇంటి తలుపులు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో పెట్టిన 21గ్రాముు బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




కర్మయోగి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, మాజీ మంత్రి పళ్లంరాజు

పుస్తక పఠనంతోనే ఉన్నత స్థానం

'కర్మయోగి' పుస్తకావిష్కరణ సభలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే ఉన్నత స్థానంలోకి వెళ్లవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. జేఎన్టీయూ అలూమ్ని ఆడిటోరియంలో 1962 బ్యాచ్ సీనియర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి, కైట్ విద్యా సంస్థల గౌరవాధ్యక్షుడు ఎం. గోపాలకృష్ణనాయుడు రచించిన 'కర్మయోగి' పుస్తకావిష్కరణ మంగళవారం సాయంత్రం జరిగింది. ప్రత్యేక అతిథిగా కలెక్టర్ షాన్‌మోహన్, అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు, మేజర్ జనరల్ ప్రసాద్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, కైట్ విద్యా సంస్థల ఛైర్మన్ పోతుల విశ్వం, డైరెక్టర్ ఐశ్వర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్స్ పరీక్షలు రాయాలంటే... ప్రతి పుస్తకం భవిష్యత్తును సూచిస్తుందన్నారు. మాజీ మంత్రి పళ్లంరాజు మాట్లాడుతూ కాకినాడలో గోదావరి ఎరువుల కర్మాగారం నిర్మాణంలో గోపాలకృష్ణ కీలక పాత్ర పోషించారన్నారు. ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విశ్వం మాట్లాడుతూ తనకు చిన్నతనం నుంచీ గోపాలకృష్ణతో పరిచయం ఉందని, తన ఎదుగుదలకు ఆయనే కారణమన్నారు. రచయిత గోపాలకృష్ణ మాట్లాడుతూ... తన జీవితంలో జరిగిన సంఘటనలను ఈ పుస్తకంలో పొందుపరిచానన్నారు. దీనిని చదవడం వల్ల విద్యార్థులకు తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి, సమాజంలో అందరి వద్ద ఏ విధంగా గౌరవం పొందాలో తెలుస్తుందన్నారు. అనంతరం గోపాలకృష్ణ-సుజాత దంపతులను అతిథులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జీఎఫ్‌సీఎల్ విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమ్మలు నరికేసినా..



అయినవిల్లి మండలం విలస పంచాయతీ పరిధిలోని లెప్రసీ ఆసుపత్రి ఆవరణలో ఉన్న మామిడిచెట్టు కొమ్మలు నరికేసినప్పటికీ బంగినపల్లి మామిడికాయలు చెట్టు పైవరకు విరగకాయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

-అమలాపురం (ఆంధ్రజ్యోతి)

అప్పన్న చందనోత్సవానికి
అన్నవరం ఉద్యోగులు

ప్రత్యేక విధుల కేటాయింపు

అన్నవరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా బుధవారం సింహాచలంలో జరిగే అప్పన్న చందనోత్సవానికి అన్నవరం దేవస్థానానికి చెందిన సుమారు 40మంది ఉద్యోగులకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ప్రత్యేక విధులు కేటాయించారు. దాంతో వారందరూ మంగళవారం సింహాచలం వెళ్లారు.

రెండు రోజులు నరకయాతన

అంతర్వేదిలో ఊబిలో చిక్కుకున్న ఆవు

సురక్షితంగా బయటకు తీసిన యువకులు



ఊబిలో కూరుకుపోయిన ఆవును రక్షిస్తున్న యువకులు



ఊబి నుంచి బయట పడిన ఆవు

అంతర్వేది, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామ పరిధిలో చెరువుల వద్ద ఖాళీ ప్రదేశంలో ఉన్న ఊబి మట్టిలో ఆవు చిక్కుకుంది. రెండు రోజుల పాటు ఊబిలోనే కొట్టుమిట్టాడుతుండడంతో స్థానికంగా చూసిన యువకులు ఆవును ఊబిలో నుంచి బయటకు తీశారు. సురక్షితంగా ఆవును కొబ్బరి బొందల సాయంతో బయటికి తీసి ప్రాణాలు కాపాడారు. బయటకు తీసుకు వచ్చిన ఆవును శుభ్రంగా కడిగి మంచినీళ్లు పెట్టి కొబ్బరితోటలో వదిలేశారని విశ్వహిందూ మహాసంఘ్ సభ్యులు గునిశెట్టి సత్యనారాయణ చూసి గునిశెట్టి రమేష్, గునిశెట్టి సాయి, గునిశెట్టి బాలు, గునిశెట్టి వాసు, పోలిశెట్టి గంగాశ్రీగిరిబాబు సాయంతో గోవును రక్షించినట్టు తెలిపారు.

సరస్వతి నదీ పుష్కరాలకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నదీ పుష్కరాలకు కాకినాడ జిల్లా నుంచి ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కాకినాడ, ఏలేశ్వరం, తుని డిపోల నుంచి 'సరస్వతీధామం-పుష్కర యాత్ర' పేరిట సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఇవి మే 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు బయల్దేరి తొలుత కాళేశ్వరం వెళ్తాయి. అక్కడ పుణ్యస్నానాల అనంతరం మహాకాళేశ్వరుని దర్శనం, రామప్ప దేవాలయం, వరంగల్ వేయి స్తంభాల మండపం, భద్రకాళి దర్శనం, ధర్మపురిలో స్నానాలు, లక్ష్మీనరసింహస్వామి దర్శనం, కొండగట్టు ఆంజనేయస్వామి, వేములవాడ రాజరాజేశ్వరిదేవి దర్శనం అనంతరం మే 18వ తేదీ ఉదయం 8 గంటలకు గమ్యస్థానాలకు చేరతాయి.

సూపర్ లగ్జరీ బస్సు కాకినాడ, ఏలేశ్వరం డిపోల నుంచి రూ.2,550, తుని డిపో నుంచి రూ.2,700. స్టార్ లైనర్ బస్సు కాకినాడ నుంచి రూ.3,600.

రిజర్వేషన్ కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
కాకినాడ డిపో: 9959225564
7382910869, 7382910778
7382910658, 7382910596
ఏలేశ్వరం డిపో
9848977344, 9490741515
తుని డిపో
7382913016

బస్సుకు సరిపడా భక్తులు ఉంటే వారు కోరుకున్న చోట నుంచి కోరుకున్న క్షేత్రాలను కోరుకున్న తేదీల్లో దర్శించుకోవడానికి బస్సులు ఏర్పాటు చేస్తామని ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు వివరించారు.

కత్తితో పొడిచి చంపేసి.. కారులో తెచ్చి పడేసి..!

- వీడిన చేబ్రోలు బైపాస్ హత్య కేసు మిస్టరీ
- మృతుడు అనకాపల్లి జిల్లా వాసిగా గుర్తింపు
- భార్య, ప్రియుడు, మరో వ్యక్తి కలిసి హతమార్చిన వైనం
- యలమంచిలిలో మృతుడి తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి





చేబ్రోలు బైపాస్‌లో లభించిన మృతదేహం, లోవరాజు (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సంచలనం కలిగించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కేసులో మిస్టరీ వీడింది. మృతుడు అనకాపల్లి జిల్లా వాసిగా... అతడిని భార్య, ప్రియుడు, మరో వ్యక్తి కలిసి ఇంటి వద్ద హతమార్చి చేబ్రోలు బైపాస్‌లో పడవేసినట్టు విచారణలో పోలీసులు గుర్తించారు. మృతుడి తల్లి ఫిర్యాదుతో ఈ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. 2 నెలల తర్వాత కేసు దర్యాప్తు కొలిక్కివచ్చింది. కేసును గొల్లప్రోలు పోలీసుస్టేషన్ నుంచి యలమంచిలి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయనున్నట్టు సమాచారం.

అసలేం జరిగిందంటే..?

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంటి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మార్చి 3న లభ్యమైంది. ఈ ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. మృతదేహంపై ఉన్న గాయాలు, పడి ఉన్న తీరు తదితర అంశాలను పరిశీలించిన పోలీసులు అతడిని హత్య చేసినట్టు గుర్తించారు. ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన జరిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ మృతుడి వివరాలు లభ్యం కాలేదు. సీసీ ఫుటేజీలు, అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, సెల్‌టవర్ సిగ్నల్స్ ఆధారంగా సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ, పోలీసులతో కూడిన బృందం చేసిన విచారణలో ఎర్ర కారు, ఇతర ఇతర ఆధారాలు లభ్యమైనప్పటికీ వాటి ఆధారంగా కేసు ముందుకు వెళ్లలేదు. ఈలోగా సోమవారం సాయంత్రం యలమంచిలి పోలీసుస్టేషన్‌లో ఒక మిస్సింగ్ కేసు నమోదైంది. తన కుమారుడు తంగెళ్ల లోవరాజు ఫిబ్రవరి 28 నుంచి కనిపించట్లేదని అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న సీఐ, ఎస్ఐ ఆ వివరాలు తెలుసుకుని దర్యాప్తు చేయడంతో మొత్తం వ్యవహారం బయటకు వచ్చింది. ఫిబ్రవరి 28నే లోవరాజును హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి పడవేసినట్టు గుర్తించారు.

వివాహేతర సంబంధం బయటపడిందని..

పోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.... అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తంగెళ్ల లోవరాజు (37), ఏలూరుకు చెందిన శ్యామలకు వివాహం జరగ్గా ఇద్దరు పిల్లలన్నారు. శ్యామలకు బావ వరుసైన మోహనకుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీనిని గుర్తించిన లోవరాజు మరోమారు కనిపిస్తే చంపేస్తానని ఇద్దరినీహెచ్చరించాడు. ఇది మనసులో ఉంచుకుని ఫిబ్రవరి 28న ఫార్మా కంపెనీలో పని చేసి రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయిన లోవరాజును శ్యామల, మోహనరావు కత్తితో పొడిచి చంపేశారు. వారికి మోహనకుమార్ వద్ద పనిచేసే గంగాధర్ సహకరించాడు. చనిపోయిన లోవరాజుని మోహనకుమార్ ఎర్ర కారులో తీసుకుని చేబ్రోలు బైపాస్ రోడ్డులోకి తీసుకువచ్చి అక్కడ పడవేశారు. ఏమీ తెలియనట్లు శ్యామల ఇంటికి వచ్చి ఉదయమే ఇల్లు కడుగుతుండగా లోవరాజు తల్లి కుమారుడి గురించి ఆరా తీసింది. అప్పుడే బయటకు వెళ్లినట్లు చెప్పడం, అదే సమయంలో రక్తపు మరకలు కనిపించడంతో ప్రశ్నించగా పిల్లి చనిపోయిందని శ్యామల తెలిపింది. అప్పటి నుంచి కుమారుడు ఇంటికి రాకపోవడం, కోడలి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో లోవరాజు తల్లి సోమవారం యలమంచిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో గొల్లప్రోలు, యలమంచిలి పోలీసులు లోవరాజు భార్య శ్యామల, మోహనరావును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తొలుత బుకాయించినప్పటికీ అన్ని ఆధారాలను పోలీసులు ముందుంచడంతో నేరం చేసినట్టు ఒప్పుకున్నారు. గంగాధర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ వ్యవహారంపై గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసును యలమంచిలి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయనున్నట్టు చెప్తున్నారు. కేసును దర్యాప్తు చేసి విచారణను కొలిక్కి తీసుకొచ్చిన సీఐ, ఎస్ఐ, విచారణ బృందంలోని ఇతరసభ్యుల్ని ఉన్నతాధికారులు అభినందించారు.

కామెర్ల మందు సృష్టికర్త సూర్యారావుకు

పద్మ అవార్డు అందించేలా కృషి

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



వెల్లలో ఎన్జీవో సైట్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక కామెర్ల వ్యాధికి వందేళ్ల క్రితం ప్రకృతి వైద్యం ద్వారా మందును సృష్టించి లక్షలాది మంది ప్రాణాలను కాపాడిన దివంగత గుండుబోగుల సూర్యారావుకు పద్మ అవార్డు అందించడానికి కృషి చేస్తానని, కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్లలో కామెర్ల మందు పంపిణీకి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గుండుబోగుల సూర్యారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ కామెర్ల వ్యాధికి ఇంగ్లీషు మందు అందుబాటులో లేని కాలంలో వెల్ల మందు సంజీవనిగా నిలిచిందన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవా భావంతో సూర్యారావు చేసిన సేవలతో వెల్ల మందు ద్వారా వెల్లకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. వందేళ్ల క్రితం ప్రారంభించిన వెల్ల మందును సూర్యారావు వంశీకులు కొనసాగించడం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రకృతి వైద్యం ద్వారా కామెర్లకు మందును పంపిణీ చేసి లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన సూర్యారావుకు పద్మ అవార్డుకు ప్రభుత్వం పరిశీలన చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించిన తరువాత కళాకారులు, ప్రకృతి వ్యవసాయం, ప్రాచీన కళలను కొనసాగిస్తున్న అనేకమందిని ఎంపిక చేసి పద్మ అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. కామెర్ల మందు కనుగొని ప్రాణాలు కాపాడిన సూర్యారావు పద్మ అవార్డుకు పూర్తి అర్హులని, వందేళ్లుగా కామెర్ల వైద్యానికి అందిస్తున్న సేవలను ఫైల్ రూపంలో అందిస్తే ప్రధాని దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం మందు పంపిణీ ప్రారంభించి నేటికీ పది రూపాయిలకే అందించడం అభినందనీయమని, ఈ సేవను మరో వందేళ్లు కొనసాగించాలని కోరారు. కామెర్ల వైద్య నిలయం వెబ్‌సైట్, డిజిటల్ సైట్, ఎన్జీవో సైట్‌లను శ్రీనివాసవర్మ, సుభాష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు, గుండుబోగుల సూర్యారావు మనుమలు, కుటుంబీకులు, గ్రామస్థులున్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు 24లోగా రిజిస్ట్రేషన్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 సంవత్సరానికి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో మే 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ సెంటర్ నుంచి వివరాలు నమోదు చేయించుకుని పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆయా అభ్యర్థులంతా సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలలో ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ కేంద్రానికి వెళ్లి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదు పత్రంతో హాజరుకావాలన్నారు. మే 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవల్ పొందాలన్నారు. అలా చేయనివారు కౌన్సిలింగ్‌కు అర్హులు కారన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో సందేశాలు ఉంటే సెల్ 9701215511ను సంప్రదించాలని ఆయన కోరారు.

స్నేహితుడిని హత్య చేసిన నలుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్

కాకినాడ క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడని చూడకుండా బండరాయితో మోది అత్యంత కిరాతకంగా హత్య చేసిన నలుగురు నిందితులను కాకినాడ టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. కాకినాడ ఎస్‌డీపీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ నిందితుల వివరాలను వెల్లడించారు. కాకినాడ సినిమా రోడ్డులోని స్టేట్‌బ్యాంకు వీధికి చెందిన మీసాల గౌతమ్‌ను (28) స్థానిక రేచర్లపేటలో అతడు ప్రేమించిన అమ్మాయి ఇంటి వద్ద అతడి స్నేహితులైన నలుగురు కాంక్రీట్ సిమెంట్ రాయితో ఈనెల 27న తలపై విచక్షణ రహితంగా మోది హతమార్చి పరారైన విషయం తెలిసిందే. అనంతరం ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు బృందంతో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక సామర్లకోట రోడ్డులో ఉన్న కోటిపల్లి రైల్వేబ్రిడ్జి దగ్గరలో రైల్వే ట్రాక్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. రేపర్లపేటకు చెందిన యాదాల దుర్గాప్రసాద్ (25), యాదాల నవీన్ కుమార్ (29), బ్యాంకోపేటకు చెందిన మహ్మద్ సందాని అలి యాస్ సన్ని (32), సాంబమూర్తినగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్‌లు(25)గా నిర్ధారించారు. మద్యం తాగడానికి డబ్బులివ్వలేదనే అక్కసుతో క్షణికావేశంలో స్నేహితుడు గౌతమ్‌ను హత్యచేసినట్టు నిందితులు విచారణలో తెలిపారని ఎస్‌డీపీవో చెప్పారు.

వడదెబ్బతో యాచకుడి మృతి



మృతిచెందిన యాచకుడు

ఎటపాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో యాచకుడు మృతిచెందిన ఘటన మంగళవారం ఎటపాకలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని భద్రాచలం, ఎటపాక మధ్య తిరుగుతూ భిక్షాటన చేస్తున్న ఓ వృద్ధుడు మంగళవారం ఎటపాకలో పొలాల్లోకి వెళ్లాడు. జామాయిల్ తోటలో కూర్చొని వడదెబ్బకు గురై మృతిచెందాడు. పోలీసులు అతడి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ఉంచి ఆచూకీకి చూస్తున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి



మరణించిన సూరిబాబు

కొవ్వూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగడంతో పాటు డీహైడ్రేషన్‌కు గురై వ్యక్తి మృతిచెందినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురానికి చెందిన మసకపల్లి సూరిబాబు (45) వారంరోజుల క్రితం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు గౌతమీనగర్‌లో ఉంటున్న సోదరుడైన హరికృష్ణ ఇంటికి వచ్చాడు. అతడికి మద్యం అలవాటు ఉండడంతో మంగళవారం ఉదయం మద్యం కోసం బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో నందమూరు బైపాస్ రోడ్డులోని టానిక్‌బార్ ఎదురుగా మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సూరిబాబు సోదరుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



నూకరాజు (ఫైల్)

తొండంగి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా బెండపూడి సెంటర్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోనగిరి నూకరాజు (80) మృతిచెందాడు. బెండపూడికి చెందిన నూకరాజు గ్రామంలో పని ముగించుకుని తారకరామాకాలనీలో ఉన్న తన ఇంటికి వెళ్తుండగా కత్తిపూడి నుంచి విశాఖపట్నం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్యకుమారులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నల్లజర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మూగ జీవి మృతిచెందిన సంఘటన మంగళవారం నల్లజర్లలో జరిగింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన రైతు గంటా శ్రీనివాసరావుకు చెందిన ఆవు పక్కరైతు ఆలపాటి శ్రీను చేనులో మేత మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బూసింగ్ రాడ్ ఆవుకు తగిలి అక్కడిక్కడే మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉందని మార్పు చేయాలని రైతులు చెబుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతు శ్రీనివాసరావు ఆవేదన చెందాడు.



నల్లజర్లలో మృతిచెందిన ఆవు

పొట్టకూటి కోసం కేరళ వెళ్లి..

సముద్రంలో మురమళ్ల మత్స్యకారుడు గల్లంతు



వీరబాబు ఇంటి వద్ద విలపిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు



సంగాని వీరబాబు(ఫైల్)

ఐ.పోలవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కేరళ వెళ్లిన మురమళ్ల మత్స్యకారుడు గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లకు చెందిన మత్స్యకారుడు సంగాని వీరబాబు చేపల బోటుపై పనిచేసేందుకు కేరళ రాష్ట్రం వెళ్లాడు. సముద్రంలో బోటుపై చేపల వేటకు వెళ్లిన వీరబాబు ప్రమాదవశాత్తూ కాలు జారి సముద్రంలో గల్లంతయ్యాడు. నేవీ అధికారులు, కోస్ట్ గార్డు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ అతడి ఆచూకీ లభ్యం కాలేదు. వీరబాబుకు భార్య, ఒక బాబు, ఆరు నెలల పాప, తల్లి ఉన్నారు. తమకు ఆధారమైన మగదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర మనోవేదనతో తల్లడిల్లిపోతోంది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లా కలెక్టర్ ద్వారా కేరళ ప్రభుత్వంతో మాట్లాడి వీరబాబు మృతదేహాన్ని స్వగ్రామం చేర్చేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన మహిళలు వీరబాబు ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరబాబు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

గిడజాంలో 11 నెలల బాలుడి మృతి

వైద్యం వికటించి మరణించినట్టు బంధువుల ఆరోపణ

న్యాయం చేయాలంటూ రహదారిపై ఆందోళన



మృతిచెందిన బాలుడు

రౌతులపూడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో 11 నెలల బాలుడు చెక్కా హర్షవర్ధన్ మృతిచెందాడు. వైద్యం వికటించడం వల్లే బాలుడు మరణించాడంటూ గ్రామంలో రహదారిపై బాలుడి మృతదేహంతో బంధువులు ఆందోళన చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడిలో చంటిపిల్లల వైద్యుడు బ్రహ్మానందం దగ్గరకు హర్షవర్ధన్‌ను తల్లిదండ్రులు చెక్కా పాప, నాగదుర్గ మంగళవారం ఉదయం తీసుకెళ్లారని, వైద్యుడు పరిక్షించి మందులు ఇచ్చినట్టు బంధువులు తెలిపారు. ఇంటికి తీసుకెళ్లి మందులు పట్టినకొద్దిసేపటికి బాలుడు స్పృహ తప్పడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు అక్కడి వైద్యుడు తెలిపాడు. దీంతో మందులు వికటించడం వల్లే బాలుడు మృతి చెందాడని, న్యాయం చేయాలంటూ గిడజాంలో రహదారిపై వాహనాలు నిలిపివేసి ఆందోళన చేశారు. పోలీసులు స్పందించి చిన్నపిల్లల వైద్యుడిపై కేసు నమోదు చేశామని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానిత మహిళ



మహిళతో తుని రైల్వే పోలీసులు

తుని రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీసుల ముమ్మర తనిఖీల్లో మంగళవారం అనుమానిత మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై ఆ మహిళ తప్పించుకునే ప్రయత్నంచేయగా పట్టుకుని ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా వివరాలు సేకరించారు. విశాఖపట్నం తాడిచెట్లపాలెనికి చెందిన పల్లి సంధ్య(29)గా గుర్తించారు. ఆమెపై చేబ్రోలు పోలీస్‌స్టేషన్లో నాన్ బెయిలబుల్ వారెంట్ ఉండగా తప్పించుకుని తిరుగుతున్నట్టు నిర్ధారణ అయ్యిందని తుని జీఆర్‌పీఎస్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆమెను సంబంధిత పోలీసులకు అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న ప్రత్తిపాడు ఎస్ఐ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అదృశ్యమైన బాలుడిని 12 గంటల్లోపే కనుగొన్నారు ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం. కాకినాడ జిల్లా ప్రత్తి పాడు మండలం టి.రాయవరానికి చెందిన ఎద్దు లక్ష్మీనారాయణ కుమారుడు లోవరాజు పదో తరగతి చదువుతున్నాడు. సక్రమంగా చదువుకోవడంలేదని తల్లి మందలించింది. దీంతో లోవరాజు ఇంటి వద్ద చెప్పకుండా సైకిల్ మీద బయటకు వచ్చి అదృశ్యమయ్యాడు. బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు సోమవారం సాయంత్రం ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎస్ఐ లక్ష్మీకాంతం రాత్రి 11గంటల సమయంలో గాలిస్తుండగా స్థానిక బస్టాండ్ వద్ద లోవరాజును కనుగొని మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ఎస్ఐను సీఐ సూర్య అప్పారావు, పలువురు అభినందించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

కొవ్వూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యో): ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. వివరాల ప్రకారం..తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన మర్రి పవన్‌కుమార్‌కి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మీసాల అప్పలరాజు రూ.3,80,000 తీసుకున్నాడు. 2024 నవంబర్ నుంచి ఉద్యోగం ఇప్పించలేదు. అడగగా సరైన సమాధానం చెప్పక పోవడంతో పవన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

అడవిపాలెం పరిసరాల్లో దుప్పి సంచారం



మలికిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అడవిపాలెం పరిసర ప్రాంతాల్లో దుప్పి సంచరిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. శంకరగుప్తం డ్రెయిన్ పరిసర ప్రాంతంలో మహిళలు దుప్పి సంచారాన్ని గమనించి స్థానికులు తెలిపినట్టు తెలిసింది. దుప్పిని కొందరు యువకులు వీడియోల్లో బంధించారు. అటవీశాఖ అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని కోరారు.

కారును ఢీకొన్న వ్యాన్

ఏడుగురు ప్రయాణికులు సురక్షితం



కారు చక్రం కింద హైవే సేఫ్టీ కోన్లు

గండేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారులో మంగళవారం కారును వెనుక నుంచి వ్యాన్ ఢీకొన్న ఘటనలో కారులో ఏడుగురు ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకుండా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో తాళ్ళూరు గ్రామానికి చెందిన ఓబిన్ వీరభద్రరావు, వీరలక్ష్మి, వీరజ్యోతి, వంశీభార్గవ్, సాయి, మంగ, పలువురు కారులో తిరుపతి ప్రయాణమయ్యారు. మల్లేపల్లి గ్రామశివారు పెట్రోల్‌బంకు వచ్చేసరికి హైవేపై ఏర్పాటు చేసిన సెఫ్టీ కోన్లు గాలికి ఒక్కసారిగా ఎగిరిపడి హైవే మధ్యలో పడటంతో ముందువెళ్తున్న మోటార్‌సైకిల్ సడన్ బ్రేక్ వేయగా వెనుక వస్తున్న కారు వేగం తగ్గించారు. ఆ వెనుక వస్తున్న వ్యాన్ కారును ఢీ కొంది. కారులో ఇద్దరు పిల్లలతో కలిపి ఏడుగురు ఉన్నారు. వ్యాన్ స్లోగా రావడంతో పెనుప్రమాదం తప్పి ఎవరికీ ఎటువంటి గాయాలుకాకుండా బయటపడ్డారు.

పేకాడుతున్న పదిమంది అరెస్ట్

రాయవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మొయిన్‌రోడ్డులో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేసి 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. టెలిఫోన్ ఎక్చేంజ్ సమీపంలో పేకాట స్థావరంపై దాడిచేసి వివిధ ప్రాంతాలకు చెందిన 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.20,750 నగదు, 10 సెల్‌ఫోన్లు, 2 మోటారు సైకిళ్లు, 2 రౌండ్ టేబుళ్లు, 15 కుర్చీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 10 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆలయంలో ఆభరణాలు నొక్కి

తెల్లవారుజామున చిక్కి!

గొల్లప్రోలులో దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు



శివాలయంలో చోరీ చేసిన బంగారు ఆభరణాలు



చోరీకి పాల్పడి పారిపోతుండగా స్థానికులు పట్టుకున్న వ్యక్తి

గొల్లప్రోలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివాలయంలో వెండి ఆభరణాలు చోరీ చేసి పరారవుతున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులు పట్టుకున్నారు. ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం)లో కల్యాణోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. స్వామి, అమ్మవార్లను వెండి ఆభరణాలతో అలంకరించారు. ఈ విషయాన్ని రెండు, మూడు రోజులుగా గమనిస్తున్న గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన పసుపులేటి శివాజీ గోడ దూకి లోపలకు వెళ్లి గర్భ గుడి తాళాలు పగులకొట్టి లోపల స్వామి, అమ్మవార్లకు ఉన్న సుమారు రెండు కిలోల వెండి ఆభరణాలను అపహరించాడు. వాటిని తీసుకుని మంగళవారం తెల్లవారుజాము సమయంలో గోడ దూకి బయటకువచ్చాడు. అక్కడి నుంచి పారిపోదామని భావిస్తున్న సమయంలో అక్కడ ఉన్న స్థానికులు గుర్తించి నిలదీయడంతో వారితో గొడవకు దిగే ప్రయత్నంచేశాడు. వెంటనే పట్టుకుని అతడి వద్ద ఉన్న సంచీని తనిఖీ చేయగా వెండి ఆభరణాలు బయటపడ్డాయి. దీంతో అతడిని గొల్లప్రోలు పోలీసులకు అప్పగించారు. శివాజీ చోరీకి పాల్పడే సమయలో కాళ్లు, చేతులకు సాక్సులు, గ్లౌజులు, ముఖానికి మాస్కు ధరించి ఉన్నట్టు చెప్తున్నారు. అతడు గతంలో కరోనా సమయంలో రెండు చోరీలకు పాల్పడినట్టు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు.

తమ్మవరంలో అక్రమ మస్తర్ల మాయాజాలం!

రూ.లక్షలు దుర్వినియోగం చేస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ స్థానంలో మేట్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తమ్మవరంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ స్థానంలో ఓ మేట్ అక్రమంగా మస్తర్లు వేసి లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాకినాడ రూరల్ మండలం తమ్మవరం గ్రామంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌ని టెర్మినేట్ చేయడంతో ప్రత్యామ్నాయంగా జాబ్‌కార్డు కలిగిన వ్యక్తిని మేట్‌గా నియమించారు. పని చేసినట్టు ఓ మైనర్ బాలుడిని ఫొటో తీసి అప్‌లోడ్ చేయడం విశేషం. అలాగే సదరు మేట్ ఓ అధికారపార్టీకి చెందిన వ్యక్తి కావడంతో పనిలోకి రానివారికి, మామిడితాండ్ర ఇతర పనుల్లోకి వెళ్లినవారికి అక్రమంగా మస్తర్లు వేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తు న్నాడని ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ పరపతితో అతనిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఒక్క గ్రామంలోనే కాకుండా పలు గ్రామాల్లో దొంగ మస్తర్ల బాగోతం జరుగుతుందని, తమ్మవరం మేట్‌పై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ మస్తర్ల బాగోతంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించగా, ఆరుగురు పనిలోకి రాకుండా మస్తర్లు వేసినట్టు గుర్తించినట్టు ఏపీవో గణేష్ తెలిపారు. విచారణ నిర్వహించిన తర్వాత నివేదిక తయారు చేసి అధికారులకు ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బొద్దవరంలో గుర్రం పందాలు



పందాలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోటనందూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బొద్దవరంలో గొంపమ్మతల్లి జాతర సందర్భంగా రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రం పందాలను తుని మార్కెట్‌యార్డు ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. పందాల్లో ప్రథమ స్థానంలో అనకాపల్లి జిల్లా చేనుల అగ్రహారానికి చెందిన మణి, ద్వితీయస్థానంలో చోడమాంబికా, తృతీయస్థానంలో నవీన్, నాల్గోస్థానంలో కోటనందూరుకు చెందిన శివరామరాజు బ్రదర్స్ నిలిచారు. వారికి బహుమతులు అందించారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

ఉపాధిహామీ పనుల పరిశీలన

అమలాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అల్లవరం కాల్వగట్టు వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో బి.కృష్ణమోహన్ పరిశీలించారు. ఉపాధిహామీ హాజరును తనిఖీ చేశారు. రైతులకు వరికోతలకు ఇబ్బంది పడకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్‌ను ఆదేశించారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఉచిత కుట్టుశిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బుచ్చిబాబు


ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, వారిని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ నడిమిలంకలో వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణ సెంటర్‌ను మంగళవారం ఎమ్మెల్యే బుచ్చిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్-6 పథకాలు అమలుచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్కిల్ డెవలెప్‌మెంట్‌లో భాగంగా టైలరింగ్‌లో శిక్షణ పూర్తిచేసిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి డిజైనింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని, మహిళలకు సొంతంగా డిజైనింగ్ పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి కల్పించే ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో కుట్టుమిషన్ శిక్షణ సెంటర్‌లను మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ నాగిడి నాగేశ్వరరావు, నాయకులు గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, పొద్దోకు నారాయణరావు, సాగి సూరిబాబురాజు, ములపర్తి బాలకృష్ణ, గొల్లపల్లి గోపి, దాట్ల బాబు, కడలి నాగు, అడబాల సతీష్‌కుమార్, కట్టా సత్తిబాబు, కన్స్టెటెన్సీకోఆర్డినేటర్ కె.గంగాధర్, ఎన్.నరసింహమూర్తి, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దేశం తిరోగమనం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

అమలాపురంటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో తిరోగమన విధానాలను అవలంభిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితిని పూర్తిగా దిగజార్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అధ్యక్షతన మంగళవారం స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ దేశ సార్వభౌమాధికారి, రక్షణకోసం భారతీయులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. మేడే వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. మే 20న దేశ వ్యాప్తసమ్మెకు సమాయత్తం కావాలని కోరారు. ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ శామ్యూల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజానాట్య మండలిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ వార్షిక నివేదికను ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సతీష్‌కుమార్‌లు అనేక అంశాలపై మాట్లాడారు. మండల కార్యదర్శిగా జె.ఏసురాజు, సహాయ కార్యదర్శిగా జి.ఆనంద్, కోశాధికారిగా వరలక్ష్మితో పాటు 9 మంది మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ..

మే 12న కాకినాడలో మాలల మహారణభేరి సభ


గడియార స్తంభం సెంటర్‌లో మాలల మహారణభేరి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భీమారావు తదితరులు

అమలాపురంటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను నిరసిస్తూ మే 12న కాకినాడలో మాలల మహారణభేరి సభ నిర్వహిస్తున్నట్టు మాలమహానాడు నాయకులు ఎంఏకే భీమారావు, పెయ్యల పరశురాముడు పేర్కొన్నారు. మహారణభేరి కరపత్రాలను మంగళవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆవిష్కరించారు. చట్టబద్ధతలేని డేటాతో వన్‌మెన్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చేసిన ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటు కాదన్నారు. వర్గీకరణను నిరసిస్తూ చేపట్టిన మహారణభేరి సభను విజయవంతం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెనుమాల చిట్టిబాబు, మట్టా వెంకట్రావు, కాశి వెంకట్రావు, ములపర్తి సత్యనారాయణ, జల్లి ఎనివాసరావు, నక్కా కృష్ణ, నాతి శ్రీనివాస్, ఊటాల వెంకటేష్, మోకా శ్రీను, సరెళ్ల రామకృష్ణ, రొక్కాల నాగేశ్వరరావు, ఉబ్బన శ్రీను, మెండి డేవిడ్ అంబేడ్కర్ పాల్గొన్నారు.

మురుగులమ్మకు మంత్రి సుభాష్ పూజలు


మురుగులమ్మతల్లిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

అమలాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బండారులంక గ్రామదేవత శ్రీ గంగాదేవి మురుగులమ్మతల్లి జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో దేవాంగ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత, బుట్టే ఉమానందికేశ్వరదైవజ్ఞ, కాశిన చినబాబు, చింతపట్ల గంగా సత్యనారాయణ, ఆశపు చిన్నీ, కాశిన బాబి, కొండా రాజు, ఏకుల విజయ్, బళ్ల శ్రీనివాసచక్రవర్తితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మురుగులమ్మతల్లిని అమలాపురం వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాస్, సరెళ్ల రామకృష్ణ, తదితరులు దర్శించుకున్నారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం

యానాం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజల గ్రామదేవత పోలేరమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. సాయంత్ర ఆలయం నుంచి తీసుకువచ్చిన కలశ స్థాప నను చిన్న సెంటర్లోని అంగన్‌గుడిలో ప్రతిష్ఠించారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఆలయ కార్యనిర్వహణధికారి జ్యోతి వెంకటేశ్వరరావులు అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు?

● ఎంపీపీ స్వగ్రామానికి అధిక నిధుల కేటాయింపుపై వైస్ ఎంపీపీ నిరసన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవానీ

ముమ్మిడివరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమావేశంలో చర్చకు తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారం కావడం లేదు.. గ్రామాల్లో ప్రజా సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని నోట్ చేసుకోవడంతోనే సరిపోతుంది. ఆ సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవు. ఇక తాము సమావేశాలకు వచ్చి ప్రయోజనం ఏమిటని వైస్ ఎంపీపీ-2 మట్టపర్తి సురేష్ తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. ముమ్మిడివరం మండల పరిషత్ సమావేశం మంగళవారం ఎంపీపీ కోలా గంగాభవానీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంపీడీవో తాడి వెంకటాచార్య శాఖల వారీగా రివ్యూను ప్రారంభిస్తుండగా వైస్ ఎంపీపీ-2 మట్టపర్తి సురేష్ లేచి ముందు గ్రామాల్లో సమస్యలు చర్చకు తీసుకువస్తాం. వాటి పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు సాధ్యాసాధ్యాలను వివరిస్తారని సూచించడంతో ఎంపీడీవో శ్రీవెంకటాచార్య సభ్యులు మాట్లాడాల్సిందిగా కోరారు. అయినాపురం పెద్దమెట్లంకలో రూ.41లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయినా ప్రజలకు మంచినీటిని అందించలేకపోతున్నామని, దీనిపై ప్రజలు తమను నిలదీస్తున్నారని సురేష్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నానాజీని ప్రశ్నించగా పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ రుణాలకు సుమారు వెయ్యి మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 47 మందికి మంజూరు చేశారు. ఎందుకు అంతమందిని పిలిచి ఇబ్బంది పెట్టారని ఎంపీడీవోని సురేష్ ప్రశ్నించారు. గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో చెరువులు, పంటబోదెల ఆధునికీకరణ పనులు మొక్కుబడిగా జరుగుతున్నాయి. ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని, ధాన్యం కొనుగోలులో దళారులు రైతులకు తక్కువ రేటు చెల్లిస్తున్నారని సురేష్ ఆరోపించారు. ఠాణేలంక మొల్లిలో మంచినీరు సక్రమంగా సరఫరా జరగడంలేదని ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు బొంతు శ్రీనివాసరావు సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వి.నానాజీ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో కొత్తలంక, అయినాపురం, గాడిలంక గ్రామాల్లో అక్రమంగా మోటార్లు బిగించి నీరు లాగేస్తున్నారని, దీనివల్ల శివారు ప్రాంతాలకు నీరు సక్రమంగా సరఫరా కావడంలేదని ప్రజాప్రతినిధులు, మోటార్ల తొలగింపునకు సహకారం అందించాలని ఏఈ నానాజీ కోరారు. పంచాయతీరాజ్ డీఈ పీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్లెపండుగ పథకంలో మండలంలో 33 పనులకు సంబంధించి రూ.3కోట్ల 85 లక్షలు మంజూరు కాగా రూ.3కోట్ల 60లక్షలతో 26 పనులు పూర్తి చేశామన్నారు. మండల పరిషత్ జనరల్ ఫండ్స్ 15వ ఆర్థికసంఘం నిధులకు సంబంధించి రూ.కోటి 31లక్షలు మంజూరు కాగా, 71 పనులు కేటాయించామని, వాటిలో 51 పనులు రూ.91లక్షలతో పూర్తిచేశామని, ఆరు పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించగా, 71 పనులను ఏయే గ్రామాల్లో పెట్టారని, ఎంపీటీసీ సభ్యులకు తెలియకుండా పనులు చేస్తున్నారంటూ వాటి వివరాలు తెలపాలని వైస్ ఎంపీపీ సురేష్ కోరగా గ్రామాలవారీగా కేటాయించిన పనులను వివరిస్తూ గేదెల్లంక గ్రామంలో 8 పనులకు రూ.16లక్షలు కేటాయించినట్టు డీఈ వివరించగా జనరల్ ఫండ్స్ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు ఎక్కువ మొత్తం ఎంపీపీ సొంత గ్రామానికి కేటాయిస్తే మిగతా గ్రామాల సంగతి ఏమిటని, పెద్ద పంచాయతీ అయిన అయినాపురం గ్రామానికి ఎంత కేటాయించారని ప్రశ్నించగా రూ.9లక్షలు కేటాయించారని, మీరు పనులు చేయించలేకపోయారని డీఈ శ్రీనివాసరావు పేర్కొనగా ఎన్నికల కోడ్ ఉంది. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని చెప్పినందున ఆ పనులు చేయలేకపోయామని సురేష్ వివరిస్తూ నిధుల కేటాయింపులో ఎంపీపీ వైఖరిని తప్పుబడుతూ సమావేశం నుంచి బయటికి వెళ్లిపోయి తమ నిరసన వ్యక్తం చేశారు. పుష్కరాలు వస్తున్నందున ప్రభుత్వం అంచనాలు నివేదించామని సూచించిందని, మండలంలో కొత్తలంక, గేదెల్లంక, అయినాపురం నుంచి కుండలేశ్వరం రోడ్డుకు ఏడు పనులకు రూ.7కోట్ల 21లక్షలతో ప్రతిపాదనలు రూపొందించామని డీఈ శ్రీనివాసరావు కోరారు. ఎంఈవో ఆర్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ మండలంలో ఆరు పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేసేందుకు ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వం పేద పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపుకు చర్యలు తీసుకుందని, దీనికి సంబంధించి మే 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. హౌసింగ్ ఏఈ కె.శ్రీవెంకటదొరబాబు మాట్లాడుతూ మండలంలో 14 జగనన్న లేఅవుట్లలో 1418 ఇళ్లు మంజూరు కాగా 247 నిర్మాణం పూర్తయ్యాయన్నారు. అలాగే సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పీఎంఈవై 2.0 పథకానికి 495 దరఖాస్తులు వచ్చాయని, ఇంటి నిర్మాణానికి రూ.2లక్షల 50వేలు రుణం మంజూరు అవుతుందని, బీసీ, ఎస్సీలకు మరో రూ.50వేలు అదనంగా ఇస్తామన్నారు. శేరులంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి మణియార్ మాట్లాడుతూ 63వైద్య పరీక్షలు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని, 130రకాల మందులు అందిస్తున్నామన్నారు. అలాగే రక్తహీనతకు సంబంధించి, క్యాన్సర్ వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. కొత్తలంక పీహెచ్‌సీ నుంచి మండలంలో ఆరు గ్రామాలను శేరులంక పీహెచ్‌సీకి విలీనం చేశామన్నారు. ఎంపీపీ కోలా గంగాభవానీ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించినట్టు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురైతే వాటిని పంచాయతీలు తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించాలని ఆమె సూచించారు. సమావేశంలో తొలుత పహల్గాంలోని ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేసింది. సమావేశంలో జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, డిప్యూటీ తహశీల్దార్ రాధాకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెప్మా బజార్ ఏర్పాటు

ముమ్మిడివరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలు దృష్టిలో పెట్టుకుని వాటికి అనుగుణంగా ఉత్పత్తులను విక్రయించడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చునని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అర్బన్ మార్కెట్‌ను కమిషనర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని వాటికి అనుగుణంగా విక్రయాలు జరపడం ద్వారా లాభాలు పొందవచ్చునన్నారు. అర్బన్ మార్కెట్‌లో డ్వాక్రా సంఘ సభ్యులు ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో చీరలు, పంజాబీ డ్రెస్సులు, పచ్చళ్లు, తినుబండారాలు, జ్యూట్ బ్యాగులు, ఫ్లవర్‌వాజ్‌లు, కొవ్వొత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, 1 గ్రామ్ గోల్డ్ ఆభరణాల స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జె.సత్యనారాయణరాజు, జిల్లా అధికారి ఓ.మంగాదేవి, సీఎంఎం భాస్కర్, సీవో రాజేశ్వరి, డీఆర్పీ శ్రీనివాస్, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

4న యానాంలో నీట్ ప్రవేశ పరీక్ష

యానాం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలలో వైద్య వృత్తిలో ప్రవేశానికి ఈనెల 4వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. నీట్ ప్రవేశపరీక్షా కేంద్రంగా యానాం విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయం కేటాయించారు. ఈపరీక్షకు యానాంలో 134మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరగనుందన్నారు. విద్యార్థులు అడ్మిట్ కార్డుతోపాటు రెండు ఫొటోలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫొటోతో కూడిన ఐడెంటీకార్డు తీసుకురావాలన్నారు. నీట్ నిబంధనలకు అనుగుణంగా డ్రెస్‌కోడ్‌ను ధరించలన్నారు. దీనికి సంబంధించిన అంశాలపై యానాం పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్‌ఏ మునిస్వామి సంబంధింత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజు అమలాపురం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో కార్మికులు డిమాండ్ల సాధనకై రిలే దీక్షలు చేపట్టారు. చివరి రోజున రిలే దీక్షల్లో కండక్టర్లు పీఎస్ రావు, ఎంబీఎస్ నారాయణ, పి.జ్యోతి, కె.నాగలక్ష్మి, డ్రైవర్లు జీఈ రావు, జీఎస్ రావు, డీటీ రావు, బి.శ్రీధర్, జీఎస్ రావు, కేవీవీఎస్ ప్రకాష్‌లు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకై రూపొందించిన 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఈహెచ్ఎస్ విధానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని కోరారు. డ్రైవర్ బీఎస్ నారాయణకు అమలాపురం డిపోలోనే కొనసాగించాలని కోరుతూ 65వ రోజు ఎన్ఎంయూ నాయకులు రిలే దీక్షలు కొనసాగించారు. డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని యునైటెడ్ వర్కర్స్ యూనియన్, ఎన్ఎంయూ ఆధ్వర్యంలో 71వ రోజు గేట్ మీటింగ్ నిర్వహించి యాజమాన్య తీరును విమర్శించారు. వెంటనే ఆర్టీసీలో రిక్రూట్‌మెంట్లు జరపాలని, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్ఎంయూ డిపో కమిటీ అధ్యక్షుడు ఎండీ ఔలియా, పితాని మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడు బాబికి బీసీ ఉద్యోగుల సాయం


దివ్యాంగుడు బాబికి సాయం అందజేస్తున్న ఉద్యోగులు

రాజోలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజోలుకు చెందిన దివ్యాంగుడు చెల్లుబోయిన బాబి రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యను అభ్యసించాడు. ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో రెండు చేతులు లేని దివ్యాంగుడైన బాబి మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించాడు. మంగళవారం రాజోలులోని బాబి స్వగృహం వద్ద బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాబికి రూ.19,559 జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దొంగ సత్యనారాయణ, జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు తారాడి వెంకటనరసింహరాజు, గౌరవాధ్యక్షుడు బి.రాచయ్య, విశ్రాంత డీఈఈ మట్టపర్తి వెంకటకృష్ణారావు, జి.బృహస్పతి, మట్టపర్తి నరసింహారావు, ఎంఈవో-2 పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి'

మామిడికుదురు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు తెలిపారు. ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమం మంగళవారం పాశర్లపూడి పంచాయతీలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యాధివల్ల శరీరంలో రక్త కణాల పరిమాణం తగ్గి రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఈ వ్యాధిబారిన పడితే తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కళ్లు పసుపు రంగులోకి మారడం, కీల్లనొప్పులు, రక్తహీనత లక్షణాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ రాజేంద్రబాబు, ఎల్‌టీ హరిశ్చంద్ర, హెల్త్ అసిస్టెంట్ కొమ్ముల సూర్యనారాయణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చిట్టబ్బాయి వర్ధంతి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి చిట్టబ్బాయి వర్ధంతిని మంగళవారం వైసీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సూర్యనగర్‌లోని చిట్టబ్బాయి స్వగృహం వద్ద మాజీమంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, పితాని బాలకృష్ణ తదితరులు చిట్టబ్బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురం హైస్కూలు సెంటర్‌లోని చిట్టబ్బాయి విగ్రహం వద్దకు వైసీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా తరలివచ్చి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కుడుపూడి సత్యశైలజ, పీకే రావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నల్లా విష్ణుమూర్తి, కేతా భానుతేజ, గుత్తుల చిరంజీవి, పందిరి శ్రీహరి, యిళ్ల శేషారావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

'బాలల్లో నైతిక వికాసాన్ని పెంపొందించాలి'

అమలాపురం టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవి సెలవుల్లో బాలల్లో నైతిక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం కోసం శ్రీసత్యసాయి బాలవికాస్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు జోన్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఉచిత శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. మే 6వ తేదీ వరకు జరిగే శిక్షణలో నిష్ణాతులైన ఎం.తిలక్, జి.శ్రీనివాస్, టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, వి.నీలిమ, ఎస్.గుణరంజన్, సీహెచ్ భవానీ, బి.మాధురిలు శిక్షణలు ఇస్తారన్నారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు జరిగే శిక్షణకు 16ఏళ్లలోపు విద్యార్థులు హాజరుకావచ్చునన్నారు. పాల్గొనే విద్యార్థులు సెల్ 9490915004 ను సంప్రదించాలన్నారు.

వాతావరణ మార్పుతో రైతుల్లో ఆందోళన

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైతులను వాతావరణం భయపెడుతోంది. కూలీల కొరత, కోత మిషన్లు అందుబాటులో లేక పలువురు రైతులు పంటను గట్టుకు చేర్చుకోలేకపోతున్నారు. నానా ఇబ్బందులు పడి నూర్పిడి ముగించిన రైతులు పొలాల్లోనే ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఈదశలో వాతావరణం రోజుకో రీతిగా మారుతూ అన్నదాతను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది. మంగళవారం నుంచి ఆకాశంలో మబ్బులతో రైతులు భయపడుతున్నారు.

కొవ్వొత్తులతో మాజీ సైనికుల నిరసన


ముమ్మిడివరంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మాజీ సైనికులు


కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న యానాం ప్రజలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని మండల మాజీ సైనికుల సంఘం పేర్కొంది. ముమ్మిడివరంలో మంగళవారంరాత్రి పోలీసుస్టేషన్ సెంటర్ నుంచి మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు జనిపల్లి జనార్థన్ ఆధ్వర్యంలో జైబుద్ధ పార్కులోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జైనికులు పెట్టా రాజబాబు, బలగా జనార్థన్, ముషిణి శ్రీనివాస్‌లతో పాటు ప్రజా సంఘాల నాయకులు వడ్డి నాగేశ్వరరావు, బుడితి నాగేశ్వరరావు, యలమంచిలి బాలరాజు, ఏడుకొండలుతో పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసన

యానాం: పహల్గమ్ లోయలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ యానాం వర్తక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని స్థానిక చిన్నసెంటర్ నుంచి యానాం పరిపాలనాధికారి కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యానాం వర్తకసంఘం ప్రతినిధులు నల్లా వెంకన్న, మాజేటి సత్యభాస్కర్, అన్నాడీఎంకే కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్, యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి దారుణం

అంబాజీపేట: జమ్ముకాశ్మీర్‌లోని ఉగ్రవాదుల దాడి దారుణమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీఎస్‌వీ మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు ఉగ్రవాద దాడిని నిరసిస్తూ కొర్లపాటి వారిపాలెంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై చర్యలు తీసుకోవాలి

మలికిపురం: మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజోలు నియోజకవర్గ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ లక్కవరంలో ఒక వ్యక్తి మత విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ వ్యక్తిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. సమావేశంలో చింతా రాజబాబు, సరెళ్ల విజయ్‌ప్రసాద్, దేవ రాజేంద్రప్రసాద్, బత్తుల మురళీకృష్ణ, నల్లి శివ పాల్గొన్నారు

మే 2న డీఎస్సీపై అవగాహన సదస్సు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో డీఎస్సీ-2025కు హాజరయ్యే అభ్యర్థులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేసినట్టు జిల్లాశాఖ ప్రతినిధులు తెలిపారు. పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంఎస్ లక్ష్మణరావు ముఖ్యవక్తగా హాజరై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. మరికొంతమంది సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్ పాల్గొని అనేక అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, మేడిచర్ల టీవీఏఎస్ సుబ్బారావులు తెలిపారు. సదస్సు అనంతరం అభ్యర్థులందరికీ సైకాలజీ మెటీరియల్‌ను అందజేస్తామన్నారు.

రేపు వన్‌స్టాప్ సెంటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మే 1న కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి వన్ స్టాప్ సెంటర్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఓఎస్‌సీకి సంబంధించిన 13 పోస్టులకు జరిగే ఇంటర్వ్యూలకు అర్హులైన అభ్యర్థులకు ఫోన్, కాల్ లెటర్, ఎస్ఐసీ ద్వారా సమాచారం అందినవారంతా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఐసీడీఎస్ అధికారులు కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ని విలసవిల్లిలో మంగళవారం సార్వా కార్యాచరణ ప్రణాళిక -2025లో భాగంగా కేంద్రీకృత అవగాహన, ప్రేరణాత్మక ప్రచారం కార్యక్రమం జరిగింది. ప్రకృతి వ్యవసాయం విభాగం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్, సలాది సతీష్, ఎన్ఎఫ్ఎంటీలు ఎం.సూరిబాబు, కె.మల్లికార్జునరావు, కేసీఆర్పీలు గుండుమోగుల రామకృష్ణ, జ్యోతి, పాటి రమణ, ఎం.రమేష్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళాలు

అయినవిల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో అన్నప్రసాద ట్రస్టుకు భక్తులు విరాళాలు అందజేశారు. మంగళవారం అమలాపురానికి చెందిన ఆర్‌వీఎస్ రామచంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విఘ్నేశ్వర అన్న ప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ ప్రధానార్చకుల ఆశీర్వచనంచేసి సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు.

నూకాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మలికిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నూకాలమ్మ అమ్మవారి నెలరోజుల తీర్థ మహోత్సవాల సందర్భంగా హుండీ ద్వారా రూ.1,89,564 ఆదాయం వచ్చినట్టు దేవదాయ అధికారులు తెలిపారు. నెల రోజులపాటు తీర్థ మహోత్సవాల్లో వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు దాతలు ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు అందజేశారు.

అధ్యాపకుడు పవన్‌కు డాక్టరేట్


భావరాజు పవన్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామానికి చెందిన నిత్య విద్యార్థి, అధ్యాపకుడు అయిన భావరాజు పవన్ తమిళనాడులోని అత్యంత ప్రతిష్ఠాత్మక వెల్టెక్ రంగరాజన్‌సైన్స్ అండ్ టెక్నాలజీ డీమ్డ్ టూబి యూనివర్శిటీ (చెన్నై)లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. బ్రెయిన్ సిగ్నల్స్ ద్వారా మానసిక వ్యాధి తీవ్రతను గుర్తించి తద్వారా మెరుగైన వైద్యం అందించే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు వెల్టెక్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ మంగళవారం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈయన గత పన్నెండేళ్లుగా భట్నపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పొందిన పవన్‌ను బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు అభినందించారు.

సత్యనారాయణకు పూలే అవార్డు

మామిడికుదురు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారుడు మంగం సత్యనారాయణ మహాత్మాజ్యోతిరావు పూలే ఐకాన్ అవార్డును అందుకున్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆనంద్ రోటరీ హాలులో సత్యనారాయణకు ఈ అవార్డు అందించి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకున్న బుర్రకథ కళాకారుడిని పలువురు అభినందించారు.


బుర్రకథ కళాకారుడు మంగం సత్యనారాయణను సత్కరిస్తున్న అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్‌వారు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే బండారు



రైతులకు పవర్ టిల్లర్స్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఇందులో భాగంగా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తున్నామన్నారు. ఆలమూరులో మంగళవారం రైతులకు ఆరు పవర్ టిల్లర్స్‌ను అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీలావణ్య, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఎ.రాజు, కూటమి నాయకులు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు: ఆలమూరు మండలం గుమ్మిలేరులో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మోదుకూరులో ఎన్టీఆర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్ల ను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

మండపేట, ఏప్రిల్, 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం ఏలేరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని మద్ది అంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ఆయన పూజలు చేసిన అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఆయనకు ఆలయ సిబ్బంది ప్రసాదాలను అందజేశారు.



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల

విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలి



కుందూరులో పాఠశాలలో విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కుందూరు ఉన్నత పాఠశాల పదవ తరగతి పాసైన విద్యార్థులంతా ఉన్నత విద్యలో రాణించాలని ఎంపీపీ పంపన నాగమణి ఆకాంక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో కుందూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులు 32 మంది ఉత్తీర్ణత సాధించారు. మంగళవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి వారిని అభినందించారు. విద్యార్థిని పంపన సుష్మ ప్రణీతతో పాటు, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ ఆది నారాయణ మూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ పెద్దిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, పి.సుబ్బారావు, కూటమి నాయకులు జగతా రమణ, పళ్ల చినబాబు, మేడిశెట్టి బాబి, చిర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.03లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,03,650 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరునక్షత్ర ఉత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆళ్వార్ సన్నిధిలో మేల్కొలుపు, నీరాజన మంత్రపుష్పం, ద్రవిడ వేదపారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం రామానుజ ఆళ్వార్ పల్లకి ఉత్సవాన్ని జరిపారు. ఆలయ ఈవో వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వెలిచేరులో సారా అరికట్టాలంటూ బుర్రకథ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

సారా మహమ్మారిని తరిమికొడదాం

ఆత్రేయపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సారాను నిర్మూలిద్దామంటూ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బుర్రకథ ప్రచారం పలువురిని ఆకట్టుకుంది. నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వెలిచేరు, పేరవరం, రాజవరం తదితర గ్రామాల్లో బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. సారా తయారీ విధానం, వాటివల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సీఐ కాత్యాయని, ఎస్ఐ అన్నవరం ఆయా గ్రామాల సర్పంచ్‌లు గంటి విజయభారతి, వేముల శ్రీనివాస్, జాన మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల మన్ననలను పొందేందుకు కృషి చేయాలి



ఆదర్శ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న డీపీటీవో రాఘవకుమార్

రావులపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల మన్నలను పొందే విధంగా నడుచుకోవాలని డీపీటీవో ఎస్.రాఘవకుమార్ అన్నారు. రావులపాలెం ఆర్టీసీ డిపోలో మేనేజర్ రమణ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా పాల్గొన్న డీపీటీవో సంస్థకు అత్యుత్తమ ఆదాయం తీసుకున్న ముగ్గురు కండక్టర్లను, మైలేజ్ నందు ప్రతిభ కనబరిచిన ముగ్గురు డ్రైవర్లను నగదు బహుమతులతో సత్కరించారు. అదే విధంగా గ్యారేజీ సిబ్బంది పలువురికి ప్రశాంస పత్రాలను అందచేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలకు ఓరియంటేషన్ శిక్షణ



ఓరియంటేషన్ శిక్షణ ఇస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలకు యువన్ ఓవర్ డ్యూస్ పై ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాయలంలోని ఇమ్యునైజేషన్ సెక్షన్ నుంచి వచ్చిన ఎంపీహెచ్ఎస్ బోసు, వ్యాక్సిన్ మేనేజర్ సునీల్ లు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చిన గర్భిణిలు, పిల్లలకు సంబంధించిన సమాచారం అంతా యువిన్ పోర్టర్‌లో ఆన్‌లైన్ ఎలా చేయాలి అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు, హెచ్ఈ రామారావు, హెచ్‌వీ మేరీమణి, ఎంపీహెచ్ఈవో గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

అమలాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అల్లవరం కాల్వగట్టు వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో బి.కృష్ణమోహన్ పరిశీలించారు. ఉపాధిహామీ హాజరును తనిఖీ చేశారు. రైతులకు వరికోతలకు ఇబ్బంది పడకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్‌ను ఆదేశించారు.

నేడు డయల్ యువర్ డీఎం

రావులపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం జీజీవీ రమణ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు ఫిర్యాదులు, సలహాలు, సూచనలు తెలపవచ్చునన్నారు. ప్రజల సమస్యలపై 99592 25549, 99592 25537లో సంప్రదించాలన్నారు.



పేరవరంలో తాగునీటి లీకేజీ పనులు చేపడుతున్న దృశ్యం

పైపులైన్ లీకేజి పనులు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరం వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో పైపులైను లీకేజీలు ఏర్పడి తాగునీరు రోడ్డుపాలవుతున్న సంగతి తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్ పర్యవేక్షణలో లీకేజీ పనులు చేపట్టి దాన్ని నివారించారు.



జడ్పీ బాలుర పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న జానకీదేవి

జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా జానకీదేవి

రావులపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాల హెచ్‌ఎంగా ఎం.జానకీదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమెకు ఎస్ఎంసీ చైర్మన్ నందం వీరవెంకట సత్యనారాయణ, ఎంఈవో బి.శ్రీనివాసరాజు, హెచ్ఎం కె.వీరభద్రం తదితరులు అభినందనలు తెలిపారు.



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

మండపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండపేట గాంధీనగర్‌లో వున్న అల్‌అమీనా మసీద్ వద్ద మంగళవారం ఐడియల్ యూత్, మూమెంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. తక్కువ ధరకే వైద్య పరీక్షలు చేసి సేవలు అందించామని ఐవైఎం అధ్యక్షుడు అబ్దుల్‌హమీద్ తెలిపారు. వైద్య శిబిరాన్ని జమాతే అధ్యక్షుడు పారుఖ్ అలీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో జాబిర్, రెహ్మాన్, మున్నా, హుస్సేన్, ఖరీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

ఆలమూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆలమూరు విద్యాశాఖ అధ్వర్యంలో సత్కరించారు. మండలస్థాయిలో మొదటి మూడుస్థానాలు సాధించిన టెన్త్ విద్యార్థులతోపాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.అప్పాజీ, సుబ్బరాజు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఎ.రాజు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాపు సంఘం పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక

ద్రాక్షారామ(రామచంద్రపురం) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) రామచంద్రపురం పట్టణ కాపు సంఘ అధ్యక్షుడిగా తొగరు బ్రహ్మాజీరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కాపు కల్యాణ మండపం స్థలదాత అరిగెల నాగేశ్వరరావు, పెమ్మనబోయన సత్యనారాయణ ఎన్నికయ్యారు. మంగళవారం రామచంద్రపురంలోవున్న అరిగెల వీరరాఘవులు కృష్ణవేణి కాపు కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై కాపు సంఘానికి సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పలు సూచనలు చేశారు. సంఘ ఉపాధ్యక్షుడిగా మట్టా దుర్గారావు, అక్కిరెడ్డి శ్రీను, ఆకుల పెద్ద, కార్యదర్శిగా పిట్టా నాని ట్రెజరర్‌గా అంకం శ్రీనివాస్, సలహాదారుడిగా పోలిశెట్టి శ్రీనివాస్, నారపరెడ్డి బలరాం, పెంటపాటి శ్రీను, పసుపులేటి సత్తిబాబు, వడ్డీ ఉదయబాను కార్యకవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అభినందించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళాలు

అయినవిల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో అన్నప్రసాద ట్రస్టుకు భక్తులు విరాళాలు అందజేశారు. మంగళవారం అమలాపురానికి చెందిన ఆర్‌వీఎస్ రామచంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విఘ్నేశ్వర అన్న ప్రసాద ట్రస్టుకు రూ.10,116 విరాళం అందజేశారు.

ధాన్యం కొనుగోలు నిబంధన పరిష్కరించరూ

• ఎమ్మెల్యేకు సమస్యను వివరించిన రైతులు • టార్గెట్ పెంచాలని కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ టార్గెట్‌లు పూర్తి కావడంతో ఆర్‌బీకేలకు వెళ్లిన రైతులు నిరాశతో వస్తున్నారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 34 శాతం మాత్రమే కొనుగోలు చేయాలన్న నిబంధనతో అనేక ప్రాంతాల్లో టార్గెట్లు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల కంటే రైస్‌మిల్లర్లు అధిక ధరకు లేదా దాదాపు అదే ధరకు కొనుగోలు చేయడంతో ఎక్కువ మంది రైతులు నేరుగా రైస్‌మిల్లర్లకు విక్రయించారు. ప్రస్తుతం బియ్యం మార్కెట్ అంతంత మాత్రంగా ఉండటంతో మిల్లర్లు భారీగా కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో ఆర్‌బీకేల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే బస్తాకు రూ.150 నుంచి 200 వరకు తేడా వస్తున్నదని రైతులు వాపోతున్నారు. దీంతో ఆయా కొనుగోలు కేంద్రాల వద్దకు వారు తిరుగుతున్నారు. టార్గెట్ లేనిదే ఏమి చేయలేమని అధికారులు చెప్పడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది ధాన్యం దిగుబడులు అధికంగా ఉండటంతో రైతులు వ్యక్తం చేస్తుండగా, కొనుగోలులో తలెత్తుతున్న మెలికతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే బండారుకు రైతుల మొర: మండలంలోని గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు రైతులు తమ సమస్యను తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్ మహేష్‌కుమార్, సివిల్ సప్లయి ఎండీ జిలానీలతో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల సమస్యలపై జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే బండారు పలువురు రైతులకు తెలిపారు.



గుమ్మిలేరు వద్ద ధాన్యం కొనుగోలు సమస్యను వివరిస్తున్న రైతులు

మున్సిపాల్టీ స్థలం ఆక్రమించుకున్నా పట్టించుకోరా?

• కౌన్సిల్ సమావేశంలో అధికారులపై ఎమ్మెల్సీ తోట ధ్వజం • వాడివేడిగా మండపేట మున్సిపల్ సమావేశం

మండపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ వాటర్‌వర్క్స్‌కు చెందిన 18 ఎకరాల భూమిలో కొంతమేర ఆక్రమణలకు గురైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. ఆక్రమించుకున్న స్థలంపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని మున్సిపల్ కౌన్సిల్ అధికారులను ఆయన ప్రశ్నించగా వారు నీళ్లు నమిలారు. ఆక్రమణ లేదని పట్టణ ప్రణాళిక విభాగం అధికారిణి రమ్యశ్రీ సమాధానం చెప్పడంతో ఎమ్మెల్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ తోట హాజరయ్యారు. సమావేశం వాడివేడిగా పలు అంశాలపై జరిగింది. మున్సిపల్ వెనకభాగంలో వున్న రిక్రియేషన్ క్లబ్ ఉండే చోట ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగింపు చర్యలు తీసుకోవాలంటూ కౌన్సిల్ తీర్మానించింది. మున్సిపల్ రోడ్డును ఆక్రమించి రిక్రియేషన్ క్లబ్ ఎదురుగా పెట్టిన బడ్డీని తొలగించాలని కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ కోరారు. ఈ అంశంపై టీడీపీ కౌన్సిలర్ యారమాటి గంగరాజు మాట్లాడుతూ ఒకే దుకాణంపై కక్ష పూరితంగా మాట్లాడటం సరికాదన్నారు. పట్ట ణంలో ఖాళీ స్థలాలకు ప్రహరీ నిర్మించుకోవా లంటే మున్సిపల్ అనుమతి అవసరమా? అని వైసీపీ ఎక్స్ అఫీసియో సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ సభలో ప్రశ్నించారు. పట్టణంలో ఆక్రమణలు ఎక్కువవుతున్నాయని టీడీపీ కౌన్సిలర్ యారమాటి గంగరాజు ఆరోపించారు. మెయిన్ రోడ్డులో వున్న మున్సిపల్ దుకాణాల ముందు వ్యాపారులు రోడ్డుపైకి వచ్చేశారని వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పైపులైన్ల నిర్వహణ అధ్వానంగా మారిందన్నారు. పట్టణంలో పలుచోట్ల సెంట్రింగ్ లైట్లు వెలగటం లేదని సభ్యులు ఆరోపించారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా ముగిసింది. సమావేశంలో కమిషనర్ టీవీ రంగారావు, వైస్ చైర్మన్‌లు, వేగుళ్ల నారయ్యబాబు, పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ నూక దుర్గారాణి, ఎమ్మెల్సీ తోట

ఉగ్రవాదుల దాడికి నిరసనగా మానవహారం

రాయవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా సోమేశ్వరం గ్రామంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన, మానవహారం నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ జమ్ము-కాశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసి హతమార్చడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడకుండా ఉగ్రవాదులకు కేంద్రం గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యవేణి, కమల, అరుణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘ నాయకురాలు త్రివేణి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరంలో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తిబాబు కుటుంబాన్ని ఆదుకోవాలి

మండపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఎం.సత్తిబాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మండపేట పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం మత్తులో వున్న యువకుడు వేగంగా బైక్ నడిపి నిండు ప్రాణాన్ని బలిగొన్నాడని ఆయన ఆరోపించారు. మృతుడు కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా ఇవ్వలేదన్నారు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

కష్టపడిన వారికి బీజేపీలో గుర్తింపు తథ్యం



బీజేపీ రాజ్యసభ అభ్యర్థి సత్యనారాయణను కలిసిన సర్పంచ్ రాంబాబు

రాయవరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు తథ్యమని ఆపార్టీ సీనియర్ నాయకుడు, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు అన్నారు. ఏపీ నుంచి రాజ్యసభకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన పాకా సత్యనారాయణను విజయవాడలో రాంబాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బీజేపీ సీనియర్ నాయకుడు కంటిపూడి సర్వారాయుడుతో కలిసి విజయవాడలో తాను పాకా సత్యనారాయణ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు.

బీజేపీ శ్రేణుల హర్షం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలకు చెందిన బీజేపీ నేత పాక వెంకట సత్యనారాయణను రాజ్యసభకు ఎంపిక చేయడంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశం దక్కడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కట్లమ్మ అమ్మవారి తీర్థం



కపిలేశ్వరపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాతపూడిలో ఉన్న కట్లమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు విజ్ఞాన తరగతులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో రెండవ రోజు వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా కథలు చదవడం, పుస్తక పఠనం జనరల్ నాలెడ్జ్‌లకు సంబంధించిన అంశాలను వివరించారు. రిసోర్స్ పర్సన్స్‌గా వినయ్‌కృష్ణ, రత్నం రాజు వ్యవహరించగా, గ్రంథాలయాధికారి టి.నమ్మశివాయ వీటి ఏర్పాట్లు నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలి

కొత్తపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో ప్రతిభ చాటిన విధంగానే భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సత్కరించారు. మండలంలో ఐదు ప్రభుత్వ పాఠశాలలో చదివి 587 మార్కులతో సయ్యద్ రషీం బేగం ప్రథమస్థానంలో, 584 మార్కులతో పి.వాణిశ్రీవిద్య రెండోస్థానం, పి.లక్ష్మిప్రణవ్య 578 మార్కులు తృతీయస్థానంలో నిలిచారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఉన్నతంగా పెరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, బి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



మండలంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

మురుగులమ్మకు మంత్రి సుభాష్ పూజలు



మురుగులమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్

అమలాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బండారులంక గ్రామదేవత శ్రీగంగాదేవి మురుగులమ్మతల్లి జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో దేవాంగ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత, బుట్టే ఉమానందికేశ్వర దైవజ్ఞ, కాశిన చినబాబు, చింతపట్ల గంగాసత్యనారాయణ, ఆశపు చిన్నీ, కాశిన బాబి, కొండారాజు, ఏకుల విజయ్, బళ్ల శ్రీనివాసచక్రవర్తితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మురుగులమ్మతల్లిని అమలాపురం వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాస్, సరెళ్ల రామకృష్ణ, తదితరులు దర్శించుకున్నారు.